News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :131 | ఖమ్మం | గురువారం, జూన్ 26, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# ఫీజులు పెంచుకోవడానికి తప్పుడు లెక్కలా?

- అలాంటి ఇంజనీరింగ్ కాలేజీలపై కేసులు పెట్టండి
- విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలి
- పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ ప్రారంభించాలి
- విద్యాశాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఫీజులు పెంచుకునేందుకు.. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ)కి తప్పుడు పత్రాలు అందజేసిన ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలపై కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం విద్యాశాఖపై సీఎం మూడు గంటలకుపైగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ ఫీజులపై చర్చించినట్లు సమాచారం. కొన్ని కళాశాలలు అధ్యాపకులకు ఎక్కువ మొత్తంలో వేతనాలు ఇచ్చినట్లు, నిర్వహణ పనులకు అధికంగా ఖర్చు చేసినట్లు టీఏఎఫ్ఆర్సీకి తప్పుడు లెక్కలు సమర్పించాయన్న ఆరోపణలు వచ్చాయి. వీటి ఆధారంగా ఫీజుల పెంపును టీఏఎఫ్ఆర్సీ కమిటీ ప్రాథమికంగా నిర్ధారించి.. అందుకు యాజమాన్యాలు సమ్మతించినట్లు వారి సంతకాలు కూడా తీసుకుంది. ఈ విషయమై ముఖ్యమంత్రి సమీక్షలో అధికారులకు స్పష్టత ఇచ్చారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్.. టాస్క్‌ఫోర్స్ అంటూ ఇంజినీరింగ్ కళాశాలలను తనిఖీ చేయించినా, కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేకపోయారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించినట్లు సమాచారం. కొందరు విద్యను వ్యాపారంగా మార్చుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు



తెలిసింది. "గత సర్కారు తీరులా కాకుండా మనం కొండను తవ్వాలి.. కళాశాలల దందాను నియంత్రించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గరాదు. విద్యారంగంలో అవినీతి మరక కనపడవద్దు. రాష్ట్రంలో సాంకేతిక విద్య దేశానికి ఆదర్శంగా మారాలి.

వివరాలు 2లో..

# 'శుభా'రంభం

- అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన శుభాంశు శుక్లా
- నేటి సాయంత్రం 4.30కి అంతరిక్ష కేంద్రానికి చేరిక
- 90% అనుకూలంగా వాతావరణం
- 41 ఏళ్ల తర్వాత భారత్ ఘనత
- ఎంతో అద్భుత యాత్ర: శుక్లా
- కేంద్ర క్యాబినెట్ ప్రశంస
- రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు




దిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతూ.. 140 కోట్ల మంది భారతీయుల ఆశలను మోస్తూ భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ అయిన మన వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. మరో ముగ్గురితో కలిసి భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్‌ద్వారా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) ఆయన పయనమయ్యారు. గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. 14 రోజులపాటు అక్కడ గడుపుతారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ యాత్ర బుధవారం ప్రారంభమైంది. అయితే ప్రయోగానికి 60 సెకన్ల ముందు ఓ చిన్న లోపాన్ని ఇంజినీర్లు సరిచేయడంతో సజావుగా సాగింది. 41 ఏళ్ల తర్వాత భారతీయుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ యాత్ర సమయంలో వాతావరణం 90 శాతం అనుకూలంగా ఉందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. నాసా, యాక్సియం స్పేస్, స్పేస్‌ఎక్స్ ఇందులో పాలుపంచుకున్నాయి. అంతరిక్ష యాత్ర ఆరంభాన్ని మన దేశంలోని పలు ప్రాంతాలతోపాటు పోలండ్, హంగరీ, అమెరికాల్లో పలువురు వీక్షించారు. రాకెట్ ప్రయోగం విజయవంతం

వివరాలు 2లో..

# జూబ్లీహిల్స్ లో గెలిచి తీరుతాం

## పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్




జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయడమే కాదు, తప్పకుండా విజయం సాధిస్తుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఇవాళ గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీ హిల్స్ ఎన్నికలపై కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపా టు జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించే దుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశా లు నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇది గోల్డన్ పీరియడ్ అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఉంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డారని ఆరోపించారు. దేశ చరిత్రలో అదో హేయమైన చర్య అని మండిపడ్డారు. ఈ కేసులో ఎంతటి వారు ఉన్నా.. శిక్ష తప్పదని అన్నారు. కాళేశ్వరంతో పాటు పలు కుంభకోణాలను వెలు గుతీసి ఎవరినీ వదిలి

వివరాలు 2లో..

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం



మంచిర్యాల: రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రిగా ఛార్జ్ తీసుకున్నప్పటి నుంచి అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నానని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అక్రమ ఇసుక దందాలు చేసే వాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశానని తెలిపారు. ప్రతీ ఒక్కరూ మీసేవలో ఇసుక బుక్ చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్మికశాఖ, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం (జూన్ 25) చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నూర్ నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.


మార్నింగ్ వాక్ కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకొని.. వాటన్నిటినీ పూర్తి చేస్తున్నానన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రతీ వార్డుకు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. రూ.30 కోట్ల నిధులతో అమృత్ పథకం ద్వారా మంచి నీరు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశామని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని పథకాలను అమలు చేస్తున్నామని

వివరాలు 2లో..

# బీఆర్ఎస్ లో ట్యాపింగ్ టెన్షన్!!

## పద్మాదేవేందర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు సిట్ నోటీసులు

- ఇంకా ఎవరి ఫోన్లు ట్యాప్ చేసి ఉంటారు..?
- కారు పార్టీలో అంతర్గతంగా చర్చ
- 15 రోజుల వ్యవధిలో 4,013 ఫోన్ల ట్యాపింగ్
- అసెంబ్లీ ఎన్నికల టైంలోనే ఎక్కువ..
- 618 మంది లీడర్లు, జర్నలిస్టులు, ఆఫీసర్లు
- అందరి వాంగ్మూలాలను రికార్డు చేయనున్న సిట్



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి ఫోన్ ట్యాపింగ్ టెన్షన్ పట్టుకుంది. కేసీఆర్ సొంత పార్టీ నేతలను కూడా నమ్మలేదని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు భారీ సంఖ్యలో ఫోన్లు ట్యాప్ అయ్యాయి. ఇందులో మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్టు సిట్ నిర్ధారణకు వచ్చింది. విచారణకు రావాలంటూ వీళ్లిద్దరికి ఇవాళ సిట్ నోటీసులు జారీ చేసింది. దీంతో గులాబీ శిబిరంలో అలజడి మొదలైంది. ఎవరి ఫోన్లు ట్యాప్ చేశారో అనే అనుమానాలు నాయకుల్లో వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 4013 ఫోన్లు ట్యాప్ అయ్యాయి.

వివరాలు 2లో..

# మనపై బాధ్యత ఉంచారు, ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి



- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి లోకేశ్ పిలుపు
- మచిలీపట్నం గెలుపు రాష్ట్రవ్యాప్త విజయానికి నాంది అని వ్యాఖ్య
- గత ప్రభుత్వ వేధింపులను గుర్తుచేస్తూ, పార్టీ కార్యకర్తల త్యాగాలకు వందనం
- ఈ ఏడాదే నిరుద్యోగ భృతి, 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన
- జూలై 2 నుంచి 'సుపరిపాలనలో-తొలి అడుగు' ఇంటింటి ప్రచారం
- వైసీపీ నేతలు ఇంకా అహంకారంతోనే ఉన్నారని విమర్శ

వివరాలు 2లో..

# పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు



ఒకవైపు బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వం ఆందో ళన వ్యక్తం చేస్తూ ఎలాగైనా అడ్డుకోవాలని ప్రయత్ని స్తుంటే.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా పోలవరం-బనకచర్ల లింకు ప్రాజెక్టు నిర్మాణం కోసం కొత్తగా ఒక ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కంపెనీల చట్టం 2013 ప్రకారం.. బనకచర్ల నిర్మాణం కోసం ఏపీ 'జలహారతి కార్పోరేషన్ లిమిటెడ్' పేరున ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసింది. విజయవాడ కేంద్రంగా

వివరాలు 2లో..

# యోగాంధ్ర అద్భుతం

- ఈ కార్యక్రమ విజయాన్ని అందరూ అధ్యయనం చేయాలి
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీ
- ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ప్రశంస
- విశాఖలో కలిగిన అనుభూతి మరెక్కడా రాలేదని వెల్లడి





అంతర్జాతీయ యోగా దశమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రశంసించారు. బుధవారం కేంద్రమంత్రివర్గ సమావేశంలో ఆయన గత వారంలో తాను పాల్గొన్న దేశ, విదేశీ పర్యటనలు, ఇతర అధికారిక కార్యక్రమాల గురించి వివరించే సందర్భంలో యోగాంధ్ర గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇందులో కీలకపాత్ర పోషించిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు,

వివరాలు 2లో..

# మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు

- 30 రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలి
- సెప్టెంబరు 30కల్లా ఫలితాలు వెల్లడించాలి
- ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం



పంచాయతీ ఎన్నికల ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నెల రోజుల్లోగా వార్డు సభ్యులు/సర్పంచుల రిజర్వేషన్లను ఖరారు చేసి, ఎన్నికల సంఘానికి సమ్మతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలియజేసిన రెండు నెలల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి.. సెప్టెంబరు 30లోగా ఫలితాలను వెల్లడించాలని ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ మాజీ సర్పంచులు పార్వతి (నల్గొండ జిల్లా మల్లేపల్లి), శ్రీనివాస్ (కుర్మపల్లి), విజయ్ (జనగామ జిల్లా కాంచనపల్లి), అనిల్‌కుమార్ (నిర్మల్ జిల్లా తల్వేద), మురళీధర్ (కరీంనగర్ జిల్లా) తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారించిన జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. "2024లో పిటిషన్లు మొదటిసారి విచారణకు వచ్చినపుడు

వివరాలు 2లో..

# జూబ్లీహిల్స్ లో గెలిచి తీరుతాం

- మొదటి పేజి తరువాయి

పెట్టే ప్రసక్తే లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లఅమలుపై కాంగ్రెస్ పార్టీ చర్చించి నిర్ణయం ఓ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ నేతలు నోరు మెదపడం లేదని కామెంట్ చేశారు. మూడు ముక్కలాటతో బీఆర్ఎ స్ పార్టీ ఖేల్ ఖతం అయిందన్నారు.

కవిత చెప్పిన ట్టు బీఆర్ఎస్లో దెయ్యాలుంటే.. కాంగ్రెస్లో దేవత లున్నారని కామెంట్ చేశారు. మహిళల అభివృద్ధి గురించి కవిత మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ రాజ్యసభ సభ్యులు కృష్ణయ్య. కవితకు మద్దతు మాట్లాడటం విచారకరమని పేర్కొన్నారు. బనకచర్లతో రాష్ట్రానికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరకోబోమని.. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు కట్టుకో మని జీవోలు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ కాదా అని మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో హరీశ్ రావు సంతకం

ఎందుకు పెట్టిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అభూత కల్పనతో బీఆ ర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వ్యవస్థను నడుపు తున్నారని.. వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# మనపై బాధ్యత ఉంచారు, ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి: మంత్రి లోకేశ్

రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో గొప్ప బాధ్యతను అప్పగించారని, వారి నమ్మకాన్ని నిలబెడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మచిలీపట్నం అంటే తెలుగుదేశం పార్టీ అని, ఇక్కడ గెలిచినప్పుడే రాష్ట్రవ్యాప్తంగా విజయం ఖాయమైందని ఆయన అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో మంత్రి కొల్లు రవీంద్రపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, ఆయన పార్టీ కోసం, చంద్రబాబు నాయుడు కోసం ధైర్యంగా నిలబడ్డారని లోకేశ్ ప్రశంసించారు. అదేవిధంగా, మచిలీపట్నంలో అనేక వేధింపులు ఎదుర్కొన్నప్పటికీ, పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపునూ అందుకుని, కార్యక్రమాలను విజయవంతం చేసిన కార్యకర్తలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన తాను, ముందుగా కార్యకర్తలతో సమావేశం కావడానికే ప్రాధాన్యత ఇచ్చానని, ఇకపై నాయకులందరూ నియోజకవర్గ పర్యటనల్లో తొలుత కార్యకర్తలతో సమావేశం కావాలని సూచించారు.

**గత కష్టాలను మరువొద్దు, అహంకారం తగదు**

ఈ రోజు తాను మచిలీపట్నం వస్తుంటే దారిపొడవునా పోలీసులు పహారా కాస్తున్నారని, గతంలో మనపై అక్రమ కేసులు బనాయించిన వారే ఇప్పుడు సెల్యూట్ కొడుతున్నారంటే అది ప్రజాస్వామ్యం గొప్పతనమని లోకేశ్ అన్నారు. చంద్రబాబు నాయుడిది సాధారణమైన మొండి ధైర్యం కాదని, 1996లో రాజమండ్రి సెంట్రల్ జైలును ఆధునీకరించిన ఆయన్నే, 2014–19 మధ్య ఆయన కట్టించిన బ్లాక్లోనే అక్రమంగా నిర్బంధించారని గుర్తుచేశారు. జైలు నుంచి చంద్రబాబు పులిలా బయటకు వచ్చారని వ్యాఖ్యానించారు.అధికారంలో ఉన్నప్పుడు అందరూ గౌరవిస్తారని, అయితే పార్టీ నాయకులు కష్టకాలాన్ని ఎన్నటికీ మర్చిపోకూడదని హితవు పలికారు. పార్టీ కోసం కంటిచూపు కోల్పోయిన చెన్నుపాటి గాంధీ, మంజులారెడ్డి, అంజిరెడ్డి తాత, తోట చంద్రయ్య వంటి వారి త్యాగాలే మనకు ఆదర్శమని పేర్కొన్నారు. “అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలా వ్యవహరించాలి. మన సమస్యల్ని మనమే పరిష్కరించుకుందాం. అంతర్గతంగా పోరాడాలి. జగన్ రెడ్డిపై కంటే మూడు రెట్లు ఎక్కువగా పార్టీలో పోరాడాను. పార్టీ ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ కట్టుబడి ఉండాలి” అని లోకేశ్ స్పష్టం చేశారు.

**సంక్షేమం, అభివృద్ధి మన అజెండా**

దేశంలో ఏ పార్టీకీ సాధ్యంకాని విధంగా 94 శాతం సీట్లను కూటమి కైవసం చేసుకుందని లోకేశ్ తెలిపారు. ప్రజలకు మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నామని, పెద్దఎత్తున కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది నుంచే నిరుద్యోగ భృతిని కూడా ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. మహిళలను గౌరవించాలనేది టీడీపీ నినాదమని, అది మన ఇంట్లోనే మొదలుకావాలని సూచించారు. 50 శాతం పనులు మగవారు, 50 శాతం పనులు ఆడవారు చేయాలనే అంశాన్ని పాఠ్యాంశాల్లో చేర్చామన్నారు.జులై 5న జరిగే మెగా పేరెంట్స్–టీచర్ మీటింగ్లో తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలని కోరారు. ఏటా మూడు సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, ఇప్పటివరకు 2 కోట్ల సిలిండర్లను పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సబ్సిడీ మొత్తాన్ని మహిళల ఖాతాల్లో జమచేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధాప్య పింఛను రూ.4 వేలు, దివ్యాంగుల పింఛను రూ.6 వేలు, పూర్తిగా అంగవైకల్యం ఉన్నవారికి రూ.15 వేల పింఛను అందిస్తున్నామని వివరించారు.

**జులై 2 నుంచి ‘సుపరిపాలనలో–తొలి అడుగు’**

కూటమి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను జులై 2 నుంచి ‘సుపరిపాలనలో–తొలి అడుగు’ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తీసుకెళ్లాలని లోకేష్ పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు.

**వైసీపీ నేతల తీరు మారలేదు**

వైసీపీ నేతలు ఇప్పటికీ అహంకారపూరితంగానే మాట్లాడుతున్నారని, ప్రతిపక్ష నేత జగన్ రెడ్డి ఇప్పటికీ ప్రజలను, కార్యకర్తలను కలవడం లేదని లోకేశ్ విమర్శించారు. “రెడ్ బుక్ పేరు చెబితేనే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరికి బాత్రూమ్లో జారి చేయి విరిగింది. మేం చట్టప్రకారం ముందుకు వెళ్తున్నాం,” అని అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు అహంకారానికి పోకుండా, సౌమ్యంగా ఉంటూ అందరికీ అందుబాటులో ఉండాలని సూచించారు. “ప్రజలు మనపై బాధ్యత పెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయాలి. కష్టపడి ప్రజల సమస్యలను పరిష్కరించాలి” అని ఉద్ఘాటించారు.

**డబుల్ ఇంజన్ సర్కార్తో ప్రగతి**

ఆంధ్రప్రదేశ్లో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని లోకేశ్ తెలిపారు. ఏపీకి అవసరమైన అన్ని సహాయ సహకారాలను ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్నారన్నారు.ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో 3 లక్షల మందితో యోగాసనాలు వేయించి గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించి, మోదీకి కానుకగా అందించామని గుర్తుచేశారు. కూటమి పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, కూటమిని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పార్టీ అనేవి జోడెద్దుల బండి వంటివని, రెండింటినీ సమన్వయంతో నడిపేందుకు కష్టపడి పనిచేస్తున్నామని అన్నారు. మాటల్లో కాకుండా చేతల్లో కార్యకర్తలను గౌరవిస్తామని స్పష్టం చేశారు.

# ‘శుభా’రంభం

కావడంపట్ల కేంద్ర క్యాబినెట్ హర్షం వ్యక్తం చేసింది. దేశం గర్వించదగిన క్షణమంటూ యాత్రను స్వాగతిస్తూ తీర్మానం చేసింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ.. శుభాంశు కు శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష యానంలో ఉన్న శుక్లా.. ఎంత అద్భుత యాత్ర అంటూ భూకక్ష్యలోకి వెళ్లాక సంతోషాన్ని పంచుకున్నారు.

**10 నిమిషాల్లో భూకక్ష్యలోకి..**

యాక్సియం–4 మిషన్లో భాగంగా ఫాల్కన్–9 రాకెట్ద్వారా శుభాంశు శుక్లా (భారత్), పెగ్గీ విట్సన్ (నాసా అంతరిక్ష మిషన్ మాజీ కమాండర్– అమెరికా), స్లావోస్జ ఉజ్నాన్స్కీ –విస్నీవ్స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) అంతరిక్షంలోకి దూసుకెళ్లారు. ప్రపంచం మొత్తం ఆసక్తిగా చూస్తుండగా నింగిలోకి దూసుకెళ్లిన వారు.. 10 నిమిషాల తర్వాత 200 కిలోమీటర్ల ఎత్తులోని భూకక్ష్యలోకి ప్రవేశించారు. డ్రాగన్ స్పేస్క్రాఫ్ట్ 28 గంటలు ప్రయాణించి గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఐఎస్ఎస్కు చేరుకుంటుంది. 41 ఏళ్ల కిందట 1984లో సోవియట్ రష్యాకు చెందిన సల్యుత్–7 స్పేస్ స్టేషన్ నుంచి రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు. ఆ తర్వాత మళ్లీ శుభాంశు శుక్లాకు ఈ అవకాశం దక్కింది. కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత తమ సరికొత్త క్యాప్సూల్ పేరును ‘గ్రేస్’గా వ్యోమగాములు వెల్లడించారు.

ఈ మిషన్ను పెగ్గీ విట్సన్.. కమాండ్ చేస్తారు. శుభాంశు శుక్లా.. పైలట్గా సేవలందిస్తారు. స్లావోస్జ, టిబర్.. మిషన్ స్పెషలిస్టులుగా వ్యవహరిస్తారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోదీల సంకల్పంలో భాగంగా ఇస్రోతో కలిసి ఈ యాత్ర చేపట్టామని నాసా ఒక ప్రకటనలో వెల్లడించింది.

వ్యోమగాములు టిబర్ కపు, పెగ్గీ విట్సన్, స్లావోస్జ ఉజ్నాన్స్కీ– విస్నియెస్కీలతో శుభాంశు శుక్లా

‘దేశ ప్రజలారా.. నమస్కారం’

అంతరిక్షంలో పయనిస్తున్న శుభాంశు శుక్లా.. యాత్రానుభవాలను పంచుకున్నారు. భూకక్ష్యలోకి ప్రవేశించిన అనంతరం ఆయన తన స్పందనను తెలియజేశారు. ‘నా దేశ ప్రజలారా.. నమస్కారం. 41 ఏళ్ల తర్వాత మనం అంతరిక్షానికి చేరుకున్నాం. ఇది ఒక గొప్ప ప్రయాణం. మేం ఇప్పుడు సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతున్నాం. నా భుజాలపై మూడు రంగుల జాతీయ జెండా ఉంది. అది.. నేను మీ అందరితో ఉన్నానని గుర్తు చేస్తోంది. ఇది ఐఎస్ఎస్కు నా ప్రయాణ ప్రారంభం మాత్రమే కాదు. భారతీయ మానవసహిత స్పేస్క్రాఫ్ట్ ప్రయాణం. మీరందరూ ఈ యాత్రలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నా. మనందరం కలిసి భారత మానవసహిత అంతరిక్ష యాత్రను విజయవంతం చేద్దాం’ అని 39 ఏళ్ల శుభాంశు శుక్లా పిలుపునిచ్చారు.

‘ఎంత అద్భుత యాత్ర (క్యా కమాల్ కీ రైడ్ థీ’). ఇది నా ఒక్కడి అంతరిక్ష యాత్ర కాదు. ఇది భారత దేశం చేపట్టిన మానవ సహిత అంతరిక్ష యాత్రకు శుభారంభం. నా ఒక్కడి ఛాతీయేకాదు.. భారతీయులందరి ఛాతీలు ఈ యాత్రను చూసి ఉప్పొంగాలి. జై హింద్. జై భారత్’ అంటూ హిందీలో శుక్లా సందేశం వినిపించారు.

ఉత్తర్ప్రదేశ్లోని లఖ్నవూలో యాక్సియం 4 మిషన్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ శుభాంశు శుక్లా తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల ఆనందోత్సాహం

లఖ్నవూలో సంబరాలు

శుభాంశు శుక్లా అంతరిక్ష పయనం సందర్భంగా ఆయన చదువుకున్న లఖ్నవూలోని సిటీ మాంటిస్సోరి పాఠశాలలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఒకవైపు సంబరాలు, మరోవైపు ఆనంద భాష్పాలతో నిండిపోయింది. శుభాంశు తల్లిదండ్రులతోపాటు పలువురు ఈ పాఠశాలలో జరిగిన సంబరాల్లో పాల్గొన్నారు. భాంగ్రా నృత్యాలతోపాటు భారత్ మాతా కీ జై అంటూ నినదించారు.

**60 ప్రయోగాలు**

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజులపాటు గడపనున్న వ్యోమగాములు.. దాదాపు 60 ప్రయోగాలు చేస్తారు. ఇందులో హ్యూమన్ ఫిజియాలజీ, న్యూట్రిషన్, సీడ్ జెర్మినేషన్లలో మైక్రో గ్రావిటీ పరిశోధనలున్నాయి. పలు కార్యక్రమాల్లో అంతరిక్షం నుంచే శుక్లా పాల్గొంటారు. అందులో ప్రధానితో సంభాషణ ఉంది. యాత్రలో భాగంగా ఆయా దేశాల్లో స్థానికంగా లభించే ఆహారాన్నే వ్యోమగాములు తిననున్నారు.

# మూడు నెలల్లోగా పంచాయతీ ఎన్నికలు

- మొదటి పేజి తరువాయి

ఓటర్ల జాబితాను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోరినట్లు ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బీసీల రిజర్వేషన్ల వర్గీకరణకు 3 నెలల గడువును ప్రభుత్వం కోరింది. అనంతరం మరో వాయిదాలో 2024 డిసెంబరులోపు ప్రక్రియ పూర్తవుతుందని కోర్టుకు హామీ ఇచ్చింది. అనంతరం ఈ పిటిషన్లు బెంచ్ ముందుకు విచారణకు రాలేదు. ప్రస్తుత విడత విచారణ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలోని ఐదు దశలకుగాను మూడు పూర్తయ్యాయని, మరో రెండు దశలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఎన్నికల సంఘం తెలిపింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్ను ఏర్పాటు చేసి, నివేదిక తెప్పించి వర్గీకరణ చేపట్టడం వల్ల ఎన్నికలను సకాలంలో నిర్వహించలేకపోయామని ప్రభుత్వం పేర్కొంది. 2024 జనవరి 31తో పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తయింది. పాలకవర్గాల పదవీకాలం ముగిసేలోగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాల్సిన రాజ్యాంగ బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతి తెలియజేయాల్సి ఉంది. అంతేగాకుండా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులను కల్పించి, ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణలో 14 నెలల ఆలస్యం జరిగిందన్నది కాదనలేని సత్యం. అయితే ఆలస్యం సమర్థనీయమా, కాదా అన్న అంశాల్లోకి లోతుగా వెళ్లకుండా ఎన్నికల ప్రక్రియలో నాలుగో దశ అయిన వార్డు సభ్యులు/సర్పంచుల రిజర్వేషన్లను ఖరారు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించడం సమంజసమని ఈ కోర్టు భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం 20 రోజుల గడువు కోరినప్పటికీ... 30 రోజులు ఇవ్వడం సముచితమని భావిస్తోంది. 30 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి... ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఎన్నికల సంఘానికి సమ్మతి తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. ప్రభుత్వం సమ్మతి తెలియజేసిన 60 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి చేయాలి. తీర్పు ప్రతి అందిన మూడు నెలల్లో ఈ ప్రక్రియను మొత్తం పూర్తి చేసి సెప్టెంబరు 30లోగా ఎన్నికల ఫలితాలను వెల్లడించాలి” అని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 30 లోగా స్థానిక ఎన్నికలు!

- మొదటి పేజి తరువాయి

బీసీ రిజర్వేషన్ల వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యమైందని, పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి నెల రోజుల గడువు కావాలని విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కోరింది. లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు 60 రోజుల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ఇరువర్గాల వాదనల అనంతరం బుధవారం (జూన్ 25) జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వం, ఈసీ అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని.. 2025, సెప్టెంబర్ 30లోగా అంటే మూడు నెలల్లోపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని ఆదేశించారు. 30 రోజుల్లోగా వార్డుల విభజన చేయాలని సూచించారు. తెలంగాణలో 2024, జనవరి 31తో సర్పంచుల పదవి కాలం ముగిసిన విషయం తెలిసిందే. దాదాపు 15 నెలలు గడిచినప్పటికీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తాజా ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మొదలు కానుంది.

## పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు

- మొదటి పేజి తరువాయి

ఈ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వరద జలాల నిర్వహణ, పోలవరం – బనకచర్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఈ కార్పోరేషన్ ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. బనకచర్ల ప్రాజెక్టుపై అన్ని అధ్యయనాలు చేసిన తర్వాత ఈ కార్పోరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు జీవోలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అండర్ లో జలహారతి కార్పోరేషన్ ను విజయవాడలో ఏర్పాటు చేసేందుకు పర్మిషన్ ఇస్తున్నట్లు చీఫ్ ఇంజినీర్ కు ఉత్తర్వులు జారీ చేసింది. బనకచర్ల నిర్మాణం అక్రమమని.. ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోమని తెలంగాణ ప్రభుత్వం పునరుద్ఘాటిస్తున్న సందర్భంలో ఏపీ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. ឧ

## ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం

- మొదటి పేజి తరువాయి

చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత బస్సులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి స్కీములన్ని ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు. 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయల నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

## బీఆర్ఎస్ లో ట్యాపింగ్ టెన్షన్!! పద్మాదేవేందర్ రెడ్డి, తాటికొండ రాజయ్యకు సిట్ నోటీసులు

- మొదటి పేజి తరువాయి

ఇందులో 618 రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు, పారిశ్రామిక వేత్తలు ఉన్నారు. వీరిలో ఆరుగురు జర్నలిస్టులు కూడా ఉన్నారు. ఈ 618 మంది లో ఇప్పటి వరకు 228 మంది స్టేట్మెంట్ రికార్డ్ చేసింది సిట్. మిగతా వారి నుంచి కూడా స్టేట్ మెంట్లు తీసుకునేందుకు సిద్ధమైంది. ఇదిలా ఉండగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితోపాటు మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కేఎస్ రత్నం, మర్రి శశిధర్ రెడ్డి ఫోన్లు ట్యాప్ అయినట్టు సిట్ నిర్ధారణకు వచ్చింది. వీరితో పాటు ఐఏఎస్ అధికారులు రోనాల్డ్ రాస్, గౌతం ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారు. వీళ్లందరినీ విచారణకు పిలిచి స్టేట్ మెంట్లు తీసుకునేందుకు సిట్ సిద్ధమవుతోంది.

**ఇతర పార్టీల్లోని కీలక నేతలే టార్గెట్**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎన్నో మలుపులు తిరుగుతోంది. అప్పటి పీసీసీ చీఫ్ ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లతోపాటు అప్పటి బీజేపీ స్టేట్ చీఫ్? బండి సంజయ్ అనుచరులు, కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం ట్యాప్ అయ్యాయి. ప్రస్తుత సమాచార శాఖ మంత్రి, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులు, అనుచరుల ఫోన్లు సైతం ట్యాప్ అయ్యాయి

## యోగాంధ్ర అద్భుతం

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర మంత్రి లోకేశ్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. “యోగాంధ్ర ఊహించని విధంగా జరిగింది. ఇప్పటివరకూ నేను ఎన్నో కార్యక్రమాలు చూశాను. కానీ యోగాంధ్రలా క్రమశిక్షణతో సాగిన అతిపెద్ద కార్యక్రమాన్ని చూడలేదు. చంద్రబాబునాయుడు, లోకేశ్లు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చేయడం అభినందనీయం. నెలరోజులపాటు ఓ కార్యక్రమాన్ని వినూత్నంగా, విజయవంతంగా కొనసాగిస్తూ రావడం మరచిపోలేని అంశం. 30 రోజులపాటు సమాజంలోని అన్ని వర్గాలవారినీ కలుపుకొంటూ యోగాంధ్రను ఎలా నిర్వహించారో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని అడిగాను. ఆ నివేదిక వచ్చిన తర్వాత అధ్యయనం కోసం అన్ని రాష్ట్రాలకూ పంపుతాను. ఒక మంచి కార్యక్రమాన్ని విజయవంతంగా ఎలా నిర్వహించాలనేది చంద్రబాబు, లోకేశ్లు చేసి చూపించారు. దీన్ని మిగతావారంతా ఆదర్శంగా తీసుకోవాలి. ఈ కార్యక్రమానికి రెండు గిన్నిస్ రికార్డులతోపాటు పలు రికార్డులు రావడం సంతోషంగా ఉంది. ఈ విజయాన్ని అందరూ అధ్యయనం చేయాలి. గత 11 ఏళ్లలో అనేకచోట్ల యోగా, ఇతర కార్యక్రమాలకు హాజరైనా విశాఖలో వచ్చిన అనుభూతి ఎక్కడా రాలేదు” అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ విషయాలను పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్నాయుడు మీడియాతో పంచుకున్నారు.

## ఫీజులు పెంచుకోవడానికి తప్పుడు లెక్కలా?

- మొదటి పేజి తరువాయి

అందుకు అవసరమైన ప్రక్షాళన చర్యలు చేపట్టాలి” అని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సమాచారం.

**న్యాయపరమైన సమస్యలు రాకుండా కౌన్సెలింగ్**

ఈసారి పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఇప్పటికే ఆదేశించిన సీఎం.. తాజాగా మరోసారి అదే విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఎవరైనా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున.. న్యాయపరమైన సలహాలు తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్ష ముగిసిన అనంతరం సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన.. అడ్వొకేట్ జనరల్ను, ఇతర న్యాయ నిపుణులను సంప్రదించారు. కౌన్సెలింగ్ షెడ్యూల్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో.. ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ అధికారులు చర్చించి షెడ్యూల్ను విడుదల చేయనున్నారు. ప్రవేశాల కమిటీ ఛైర్మన్ అయిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని సీఎం సమీక్ష సమావేశానికి ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది.

**ఐఏఎస్లూ.. బడులను సందర్శించాలి: సీఎం**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని లక్ష్యం విధించారు. ఐఏఎస్ అధికారులందరూ బడులతోపాటు అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విధిగా తనిఖీ చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో 48 వేల మంది చేరారని అధికారులు చెప్పగా.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులు నిర్మించాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలూ పెరుగుతున్నందున వారికి వసతులు కల్పించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్మీడియట్/తత్సమాన కోర్సుల్లో చేరేలా చూడాలని నిర్దేశించారు. ఇంటర్మీడియట్ అనంతరం నైపుణ్య కోర్సుల్లో శిక్షణ పొందితే వారి జీవనోపాధికి ఢోకా ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు కట్టెల పొయ్యి బాధల నుంచి విముక్తి కల్పించాలని.. సోలార్ కిచెన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత, జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## భవనిర్మాణ కార్మికుడు కలుకురి అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి :- సిఐటియు



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 25.** భవనిర్మాణ కార్మిక సంఘం వెల్వర్తి గ్రామ శాఖ అధ్యక్షులు కల్కూరి అంజయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది. భవనిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సంతాపం తెలియజేస్తూ పుష్పగుచ్చాల నుంచి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులు తుర్కపల్లి సురేందర్ మరియు భవనిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి రాధారపు మల్లేశం గార్లు మాట్లాడుతూ. భవనిర్మాణ కార్మికులు కల్కూరి అంజయ్య గత 35 సంవత్సరాల నుండి భవ నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ, అనేక ప్రమాదాల గురి కావడం జరిగిందని గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం బాధాకరమని అన్నారు. అంజయ్య గారు భవనిర్మాణ కార్మిక సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు గత కొంతకాలంగా పనిచేస్తూ కార్మికులకు అనేక సేవలు అందించారని వారు లేకపోవడం కార్మికులకు నష్టం జరిగింది అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంజయ్య కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవనిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు సింగారం వెంకటేశం మండల్ నాయకులు ఉక్కుర్తి స్వామి మొగిలిపాక ఎల్ల స్వామి చేగురి నగేష్ కలిమిరా సుదర్శన్ ఉ కుర్తి నాగయ్య కల్కూరి బాలరాజు పోలె పాక శంకర్, క లుకూరిశంకరయ్య, బొజ్జ కిష్టయ్య, చెమడాల నర్సింగ్,ఉక్కుర్తి శీను, గుర్రాల రాములు, తదితరులు పాల్గొన్నారు

## 2025 -26వ సంవత్సరానికి గాను నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక



**సి కె న్యూస్ ప్రతినిధి:**తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలలో 2025 26 విద్యా సంవత్సరానికి గాను నాలుగోవ తరగతిలో ప్రవేశానికి గాను జిల్లా స్థాయి లో సర్దార్ పటేల్ స్టేడియం నందు ఎంపికలు నిర్వహించటం జరిగింది. జిల్లా నందు గల అన్ని మండలాల నుండి మొత్తం బాలురు (40) బాలికలు (15) మొత్తం (55) మంది హాజరు కావటం జరిగింది. జిల్లా స్థాయి లో ఎంపిక అయిన (10) మంది బాలురు (10) మంది బాలికలను జూలై 1 %ฉ% 3 న హకీంపేట్, హైదరాబాద్ నందు జరిగే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపించటం జరుగుతుందన్నారు
ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి తుంబూరు, సునీల్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్ కుమార్ , అబ్జార్వర్ బి.రాంబాబు ఫుట్ బాల్ కోచ్ అథ్లెటిక్స్ కోచ్ యం.డి.గౌస్ , ఉష కోచ్ పరిపూర్ణ చారి , బాస్కెట్ బాల్ కోచ్ చంద్రకాంత్ , టెన్నిస్ కోచ్ కైలాష్ మహతో , ఆర్చర్ కోచ్ నగేష్ , జిమ్నాస్టిక్స్ కోచ్ సిరి పాల్గొన్నారు

## అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉంచాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- మైనింగ్ శాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -25:**జిల్లాలో అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉంచాలని, ఎక్కడా కొరత రావడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లో బుధవారం మైనింగ్, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి, ప్రాధాన్యత కార్యక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో ఇసుక కొరతరాకుండా టిజిఎండిసి చూసుకోవాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి అవసరమైన ఇసుక వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు టి.జి.ఎం.డి.సి. కు అందించాలని, నేరుగా వర్క్ సైట్ వద్ద అవసరమైన మేర ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.
టి.జి.ఎం.డి.సి. ఖమ్మం క్రొత్త బస్టాండ్ దగ్గర డిగ్రీ కళాశాల ఎదురుగా సాండ్ బజార్ ఏర్పాటు చేసిందని, అదే రీతిలో డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు మధిర మార్కెట్ యార్డు, పాలేరు తహసిల్దార్, కూసుమంచి ఎంపిడిఓ కార్యాలయం, సత్తుపల్లి మార్కెట్ యార్డు వద్ద సాండ్ బజార్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
సాండ్ బజార్ ల నిర్వహణ స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించడం వల్ల, నెలలో ఇసుక అమ్మకం ఎంత, నెలకు ఎంత ఆదాయం వారికి సమకూరుతుందో నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జరిగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు నిబంధనల ప్రకారం జీరో పర్మిట్ విధానం పటిష్టంగా అమలు చేయాలని అన్నారు
ఈ సమావేశంలో మైన్స్ ఏడి సాయినాథ్, టిజిఎడిసి పీవో జి. శంకర్ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు....

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- నగరంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ లో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -25:** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.
మంత్రివర్యులు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో అవసరమైన విద్యుత్ లైన్లు వేసేందుకు నిధులు చెల్లించామని, స్థానిక అధికారులు దగ్గరుండి సరిగ్గా పని చేయించుకోవాలని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.
6వ డివిజన్ లో ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వానలు రాకముందే పూర్తి చేయాలని, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు.
100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని డివిజన్ లలో అమలు చేయాలని, వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో అధిక శ్రద్ధతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. నగరంలో పెండింగ్ అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వర్షాకాలం ముగిసిన తర్వాత వాటిని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.
డివిజన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచడం బాధ్యతగా చేయాలని, ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకొని పోకుండా చూడాలని, ప్రైవేట్ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, గ్రౌండ్ లెవెలింగ్ వంటి పనులు చేపట్టాలని భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు.
నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ డివిజన్ లో అంతర్గత రోడ్లు, డ్రైయిన్ నాణ్యతతో నిర్మించుకోవాలని అన్నారు. మన ఇంటి ముందు చెత్త వేయవద్దని, కార్పోరేషన్ అధికారులకు సహకరించాలని అన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు తమ వంతు బాధ్యత నెరవేర్చాలని అన్నారు.
నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 580 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు 50 లక్షల రూపాయలతో నేడు శంకుస్థాపన చేశామని అన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు రోడ్డు విస్తరణ పనులు, పేయింటింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణ కోసం నూతన వాహనాలను కొనుగోలు చేశామని అన్నారు. నగరంలో ప్రజలకు ప్రాథమిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, పబ్లిక్ హెల్త్ ఇఇ వి.రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం. ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## వరద విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి
- నీటి వనరుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో విపత్తుల నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ - 25:**వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విపత్తుల నిర్వహణపై జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో బుధవారం సమీక్షించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గతంలో ముంపునకు గురైన ప్రతి హ్యాబిటేషన్ ఇంటిలో ప్రజలను మరోసారి వరదలు వస్తే ఎక్కడికి తరలిస్తామనే మైక్రో లెవల్ ప్లానింగ్ సిద్ధం చేసుకోవాలని అన్నారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా సమీపంలో రిహాబిలిటేషన్ సెంటర్ లను గుర్తించి, అక్కడ అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించాలని, పునరావాస కేంద్రాల సమాచారం ముందుగానే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందించాలని, వరద రాగానే ఆ కేంద్రాలకు వెళ్లేలా ప్రజలను సిద్ధం చేయాలని అన్నారు.
సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేసుకొని సత్వరమే పరిష్కరించేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు.
వరదల గురించి ముందుగానే మనకు సమాచారం అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న నీటి వనరులను నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో, నీటి వనరులకు సమీప ప్రాంతాల్లో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు అందుబాటులో ఉంచాలని, గజ ఈతగాళ్ళ ను పంపే విధంగా జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. 300 మంది ఆపద మిత్రల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక తయారు చేయాలని, విపత్తుల నిర్వహణ కోసం ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలను స్థానికంగా అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.
వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల నిర్వహణ, అక్కడ ప్రజలకు అవసరమైన ఆహార సరఫరా, మెడికల్ క్యాంపు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్, స్థానిక సంస్థల ద్వారా ప్లానింగ్ చేయాలని అన్నారు.
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలో ఉన్న మున్సిపాల్టీలలో వాటర్ లాగింగ్ లేకుండా అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వరదల సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితుల సమాచారం అధికారుల నుంచి వెంటనే తనకు అందాలని కలెక్టర్ ఆదేశించారు.
పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు చాలా అవసరమని అన్నారు. లో తట్టు ప్రాంతాల స్థానిక నాయకులతో సమన్వయంతో ఉండాలని, ప్రజలలో అనవసర ఆందోళన సృష్టించవద్దని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లోనీ రోడ్డు గుంతలు పూడ్చివేయాలని అన్నారు.
అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో పునరావాస కేంద్రాలలో ప్రజలను తరలించినప్పుడు వారికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా జిప్ కవర్లు పంపిణీ చేయాలని, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో భద్రపర్చుకొనేటట్లు తెలియజేయాలని అన్నారు. ప్రతి మండలంలో గజ ఈతగాళ్ళ జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు.
ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలి..

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..

**సికె న్యూస్ ప్రతినిధి** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం లోని గిడ్డంగుల సంస్థ ఆవరణలో జరుగుతున్న సి.సి రోడ్డు నిర్మాణ పనులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.. మంచిగా లెవెల్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు.. అనంతరం గోడౌన్ లో ఉన్న సన్న బియ్యం నిల్వలను పరిశీలించారు..ఈ సన్న బియ్యం రక్షణ,భద్రత తదితర అంశాలను ఏర్పాట్లును క్షేత్ర స్థాయిలో వారు క్షుణ్ణంగా పరిశీలించారు.. గోడౌన్ లలో నిర్లక్ష్యానికి, అవినీతి కి పాల్పడితే సహించేది లేదని,కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు..



## నేడు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవ ర్యాలీ...

- జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నేడు (గురువారం) ఉదయము 7.00 లకు వెంకటరమణ టాటా మోటార్స్, రత్నదీప్ ఎదురుగా గల ఖాళీ స్థలం నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ర్యాలీ ని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారన్నారు.
ఇట్టి ర్యాలీలో వివిధ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారని, ర్యాలీ అనంతరం లకారం ట్యాంక్ బండ్ వద్ద ర్యాలీని ఉద్దేశించి, కలెక్టర్, పోలీస్ కమిషనర్ల సందేశం ఉంటుందని సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతుల అభివృద్ధికి బ్యాంకులు దోహదపడాలి....

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- వేంసూర్ మండలం అడసర్లపాడు, కందుకూరు గ్రామాల్లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ నూతన బ్రాంచ్ లను ప్రారంభించిన మంత్రి తుమ్మల



**సికె న్యూస్ ప్రతినిధి వేంసూర్, జూన్ -25:**రైతుల అభివృద్ధికి బ్యాంకులు తమ వంతు సహకారం అందించి దోహదపడాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.
మంత్రివర్యులు, బుధవారం వేంసూర్ మండలం అడసర్లపాడు, కందుకూరు గ్రామాల్లో పర్యటించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ నూతన బ్రాంచిలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి బ్యాంకులు సంపూర్ణ సహకారం అందించాలని అన్నారు. పంట రుణాలతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా వ్యవసాయ టర్మ్ రుణాలు, వ్యవసాయ సంబంధిత రంగాల అభివృద్ధికి రుణాలను నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం పంపిణీ చేయాలని మంత్రి సూచించారు.
గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన సహకార బ్యాంక్ బ్రాంచీలు స్థానిక రైతాంగానికి మేలు చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, బోనస్, పంట నష్ట పరిహారం వంటి వివిధ కార్యక్రమాలను సకాలంలో అంద చేయాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, డిసిసిబి డిజిఎం వేణుగోపాల్ రావు, సర్వేశ్వర్ రావు, ఏజిఎం చందు రావు, మేనేజర్లు నాగలక్ష్మి, రజిత, అలీమ్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి...



- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- కిచెన్ లో మెనూ ప్రకారం భోజనం శుచికరంగా తయారు చేయాలి
- డ్రగ్స్ (మందులు) కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలి
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -25:** మెరుగైన సేవలతో ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
జిల్లా కలెక్టర్, బుధవారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న టాయిలెట్స్, డయాలసిస్ వార్డు, ఫార్మసీ స్టోర్, జనరల్ వార్డు, కిచెన్ లను తనిఖీ చేసి, ఆసుపత్రిలోని రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురుషుల మెడికల్ వార్డు లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు, ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చింది, డాక్టర్లు చూశారా, మందులు ఇచ్చారా, పరీక్షలు చేస్తున్నారా, నర్సులు, సిబ్బంది సేవలపై రోగులను అడిగి కలెక్టర్ ఆరా తీశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మనం మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం అంశంలో ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలు లేదని, అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.
ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మసీ స్టోర్ లో అన్ని రకాల డ్రగ్స్ ( మందులు) అందుబాటులో ఉండాలని, ఏ డ్రగ్ స్టాక్ చివరికి వచ్చినా లేఖ రాసి వదిలేయకుండా వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని, వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు ఫాలో అప్ అవుతూ ఆసుపత్రిలో మందుల స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.
ఆసుపత్రిలో కిచెన్ విభాగంపై ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచి, శుచికరమైన ఆహారం అందించాలని, ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్ ద్వారా అవసరమైన రోగులకు రెగ్యులర్ గా నిర్ధారణ పరీక్షలు జరపాలని, పరీక్ష ఫలితాలను సకాలంలో అందించాలని అన్నారు. పరీక్షల రిజిష్టరు ను పరిశీలించి, ఏ ఏ పరీక్షలు చేపడుతున్నది, ఫలితాలు ఇస్తున్న వివరాలు పరిశీలించారు. పరీక్షల కిట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఎటువంటి పరీక్షల నిమిత్తం రాయవద్దని కలెక్టర్ తెలిపారు. సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని అన్నారు.
ఈ ఆకస్మిక తనిఖీ సమయంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. బి. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంప్రసాద్, డా. రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పాఠశాలలలో విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలు ఉండవు..

- ఎస్ ఆర్ డి జె జోనల్ ఇన్చార్జి సతీష్




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,జూన్ 25,** చుంచుపల్లి మండలం లో గల ఎస్.ఆర్ డి.జె స్కూల్ నందు చదువుతున్న విద్యార్థి పాఠశాల ఉపాధ్యాయులు హోం వర్క్ చేయలేదని మందలించడం తో విద్యార్థి మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడటంతో కొత్తగూడెం లో చర్చనీయాంశంగా మారింది. స్కూల్ యాజమాన్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చుంచుపల్లి మండలంలో ఎస్.ఆర్ డి.జె పాఠశాలలో చదువుతున్న 10 వ తరగతి విద్యార్థి హోం వర్క్ చేయలేదని మంగళవారం ఉపాధ్యాయులు మందలించడం జరిగిందని తెలిపారు. సుజాతనగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన విద్యార్థి మనస్తాపానికి గురై ఇంటి వద్దనే ఎలుకలు వంటి కీటకాలు చంపే మందు ని తాగి బుధవారం స్కూల్ బస్సు ఎక్కడని బాధిత విద్యార్థి తెలిపాడని అన్నారు. బస్సు లో ఉన్నటువంటి తోటి విద్యార్థుల ద్వారా సమాచారం తెలిసిన వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించి తక్షణమే చుంచుపల్లి మండలం లో గల హాస్పిటల్ నందు వైద్యం అందించే ప్రయత్నం చేశామన్నారు. తల్లిదండ్రుల కొరినట్లుగానే కొత్తగూడెం లోని ప్రముఖ హాస్పటల్ కి తీసుకు వెళ్లినట్లుగా తెలిపారు. ప్రస్తుతానికి విద్యార్థి ఆరోగ్యం బాగానే ఉందని అన్నారు. మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి తల్లిదండ్రులు హైదరాబాద్ తీసుకు వెళ్తున్నట్లు సమాచారం ఉందన్నారు. బాగా చదివి విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండాలనే ఆశించి బాగా చదవాలని చెప్పేందుకు మాత్రమే విద్యార్థులను మందలించడం జరుగుతుందని ఎస్.ఆర్ డి.జె స్కూల్ సిబ్బంది పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ మెరుగు పడాలనే చూస్తామని ఏ యొక్క విద్యార్థిపై కక్షసాధింపు చర్యలు పాఠశాలలో ఉండవని ఎస్.ఆర్ డి.జె పాఠశాల జోనల్ ఇంచార్జ్ సతీష్ అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత.




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 25.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని కంచనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రేసు బుచ్చిరెడ్డి రెడ్డి మరియు గ్రామ శాఖ కమిటీ సభ్యుల సమక్షంలో మామిడి కమలమ్మ వైఫ్ ఆఫ్ మామిడి భద్రారెడ్డి కి సీఎం రిలీఫ్ ఫండ్ 22000 రూపాయలు చెక్కును అందజేసినారు ఈ కార్యక్రమంలో జక్క నరసింహారెడ్డి మన్యం నారాయణరెడ్డి మన్యం వెంకటరెడ్డి కొలిచేలిమి నరసింహ చిట్యాల నరసింహ జక్క రఘుపతి రెడ్డి కొలిచెలిమే వెంకటేశం మన్యం ప్రభాకర్ రెడ్డి బేతాళ సోమయ్య పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య.
- పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ.
- చింతకాని మండలం వందనం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్- 25:** చదువు తోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
బుధవారం చింతకాని మండలం వందనం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ స్కూల్ పరిసరాలు, పిల్లల టాయిలెట్స్, వంటగది, పాఠశాల నందు తరగతి గదులు తిరుగుతూ, విద్యా బోధన ప్రక్రియను పరిశీలించారు.
పాఠశాలలో మొదటి తరగతి, ఐదవ తరగతి క్లాస్ రూం లోకి వెళ్లి ఉపాధ్యాయురాలు ఇంగ్లీష్ బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ ఇంగ్లీష్ లో మాట్లాడారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కొత్త వర్క్ బుక్స్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు వారి ఆరోగ్యం, ఎదుగుదల పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నామని తెలిపారు.
విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపుతుంటారని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు . కష్టపడి చదివే విద్యతోనే భవిష్యత్తులో గొప్ప ఉద్యోగాలు సాధించుకోవచ్చు అని అన్నారు.
అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం అన్నం, కూరలు, కోడిగుడ్డు నాణ్యతను పరిశీలించారు.
కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

బూర్గంపాడు ఎస్సై నాగ భిక్షు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / బూర్గంపాడు ప్రతినిధి, (సాయి కౌశిక్),జూన్ 25,** బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బూర్గంపాడు ఎస్సై నాగ భిక్షు ఆధ్వర్యంలో యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని బూర్గంపాడు ఎస్ఐ నాగ బిక్ష అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహనా వారోత్సవాల్లో భాగంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే ఆరోగ్య ప్రభావాలు,ఆర్థిక,సామాజిక దుష్పరిణామాల పై అవగాహన కల్పిస్తూ జిల్లా పోలీసు శాఖ తరపున నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.
యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలు లాంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ అమూల్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు.విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు.మత్తు పదార్థాలైన గంజాయి,డ్రగ్స్ వంటివి తీసుకుంటే ఆరోగ్యంపై పడే హానికర ప్రభావాలతో పాటు ఆర్థిక నష్టాలు, సమాజంలో గుర్తింపు గౌరవం ఉండదని సూచించారు. ఈ డ్రగ్స్ నిర్మూలన కొరకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు.యవత,విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తు లో ఉన్నత స్థానాల్లో ఉండాలని పిలుపునిచ్చారు. మండలంలో ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లయితే వెంటనే పోలీసులు వారికి సమాచారం అందించాలని అన్నారు.అనంతరం మిషన్ పరివర్తన్ మాదక ద్రవ్యాల సమాజ నిర్మూలనే లక్ష్యంగా తయారు చేయాలని అన్నారు.డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ సైనికుల వలె పాటుపడాలన్నారు.
ఈ కార్యక్రమంలో బూర్గంపాడు ఎస్సై టు నాగ బిక్షు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గుగులోత్ చినియా,వారి సిబ్బంది విద్యార్థులు, లెక్చరర్స్ లు తదితరులు పాల్గొన్నారు.




# మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాని ఆదర్శంగా నిలుపాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వన మహోత్సవానికి నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయండి.
- మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యచరణ.
- చింతకాని మండలం వందనం గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్ -25:** పచ్చదనం పెంపొందించేందుకు నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు సిద్ధం చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.
జిల్లా కలెక్టర్ చింతకాని మండలంలో బుధవారం పర్యటించారు. వందనం గ్రామంలోని నర్సరీ ని సందర్శించి, నర్సరీ అంతా కలియతిరిగి మొక్కలను పరిశీలించారు. జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని, మొక్కల సంరక్షణకు చేయాల్సిన కార్యచరణ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాకు ఆదర్శంగా నిలపాలన్నారు. గతం కంటే స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో ప్రతి శాఖ, వారికి కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన ట్రీ గార్డ్ మొదలైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ ఏ మొక్కలు నాటుతున్నామో స్పష్టమైన రికార్డు నిర్వహించాలన్నారు. 2 మీటర్ల ఎత్తు కంటే చిన్న మొక్కలు పెట్టడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు.
మొక్కలు నాటే స్థలం ట్యాగ్ చేసి పెట్టుకోవాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో లక్ష్యం చేరుకునేందుకు అవసరమైన మేర గుంతల తవ్వకం పనులు ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద సర్వైవల్ రేట్ అధికంగా ఉండే మొక్కలు నాటడానికి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు. వార్డు అధికారులు తమ వార్డు పరిధిలో మొక్కలు నాటడం వాటి సంరక్షణకు బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.
వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇళ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం అధికారులు పరిశీలించాలని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్ష ణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.
అనంతరం కలెక్టర్, వందనం గ్రామంలోని స్వయంభు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆశ్వీరాదం ఇచ్చి స్వామివారి శేషవస్త్రం, తీర్థాప్రసాదాలు కలెక్టర్ కు అందించారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, చింతకాని ఎంపీడివో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీతాల కోసం కాదు జీవితాల కోసం చేసే సమ్మె.....!

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి....
- అధికారులకు సమ్మె నోటీసులు అందించిన కార్మిక సంఘాలు....




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, (సాయి కౌశిక్),జూన్ 25,** జులై 9 వ తారీఖున జరిగే కార్మికుల సమ్మె జీతాల కోసం కాదని కార్మికుల జీవితాల కోసం చేసే పోరాట సమ్మె అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం బి నర్సారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పలువురు అధికారులకు ఆయా రంగాల సమ్మె నోటీసులను అందించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ రమాదేవికి సమ్మె నోటీసులు అందించారు అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో డిసిహెచ్ రవీంద్ర నాయక్ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ముదిగొండ రామకృష్ణాలకు జులై 9 తారీకున జరిగే సమ్మె నోటీసులు అందించి కార్మిక సమ్మెకు మద్దతు పలకాలని కోరారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రమక్రమంగా కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి కే పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్లో కూటమి సర్కార్ కార్మికుల పనిగట్టల సవరణ చట్టాన్ని తీసుకువచ్చి 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకే చట్టాల స్థానంలో కోడ్లను తీసుకువచ్చి నిరంకుశ పాలనను మోడీ చేస్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జూలై 9 తారీఖున భారతదేశ వ్యాప్తంగా కార్మికులందరూ సమ్మెకు సిద్ధమయ్యారని కార్మికుల జీవితాల కోసం చేసే ఈ సమ్మెకు అధికారులు సహకరించాలని కోరారు. ఆసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు ఆరు నెలలకో ఓసారి జీతాలు ఇస్తూ కార్మికుల ఆకలి బాధలతో పనిచేపిచ్చుకుంటున్నారని జీవో ప్రకారం జీతాలు కూడా చెల్లించడం లేదని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సైతం నెలలు తరబడి బిల్లులు రాక అప్పులు చేసి పిల్లలకు అన్నం వండి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని జూలై 9 వ తారీఖున సమ్మె తలబెట్టామని ఈ సమ్మె విజయవంతానికి ప్రతి కార్మికుడు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పారెల్లి సంతోష్ కుమార్ పిలక శివకుమారి రమ గీత మమత, వరలక్ష్మి రాజేశ్వరి, దమయంతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి.

- దేగల దేగల అంజయ్య యాదవ్ కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 25.** వలిగొండ యాదాద్రి :రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పని చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు దేగల అంజయ్య యాదవ్ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రములో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ పటిష్టం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు రాబోయే స్థానిక ఎన్నికల్లో జెడ్పి చైర్మన్లు జడ్పీటీసీలు మున్సిపల్ ఛైర్మెన్లు కౌన్సిలర్లు ఎంపీపీ ఎంపీటీసీ సర్పంచలు వార్డ్ సభ్యులు అత్యధికంగా గెలుపుంచుకునేనందుకు ప్రతి కార్యకర్త నాయకులు సమన్వయంతో పనిచేయాలి అన్నారు

# పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాలి.

- అసెంబ్లీలో తీర్మానం చేసిన బీసీ బిల్లుకు గవర్నర్ ద్వారా జీవో తీయాలి.
- బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వకుంటే యుద్ధమే
- రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తాం
- పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్.



**సి.కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూన్ 25.** రామన్నపేట పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అసెంబ్లీలో చేసిన బిల్లుకు గవర్నర్ ద్వారా జీవో తీయాలన్నారు రామన్నపేట సుభాష్ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీ ప్రకారం పంచాయతీ ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇస్తామన్నారు అలాగే కామారెడ్డి డిక్లరేషన్ హామీను అమలు చేయాలి లేకుంటే యుద్ధమే ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామన్నారు 60 శాతం ఉన్న బీసీలు రాజకీయంగా 12% దాటలే ఇదెక్కడి ప్రజాస్వామ్యం ఇది అటవీక న్యాయం %మీూా%లు మీరే %వీూ%లుమీరే మంత్రులు మీరే ముఖ్యమంత్రి మీరే బీసీలు సర్పంచులు %వీూజ్ఞ్యాజ%లు అయితే గిట్ల ఓర్వలేరా బీసీ రిజర్వేషన్ పెంచుటకు న్యాయపరమైన చిక్కులు ఎలాంటివి లేవన్నారు రాజ్యాంగం లోని 253 %ఐ6 ఎ%6 ప్రకారం స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వమే రిజర్వేషన్లు ఖరారు చేసుకోవచ్చని ఉన్న బీసీలు రాజకీయంగా ఎదగకూడదనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు పక్క రాష్ట్రం బీహార్లో 69 శాతం తమిళనాడులో 70% అమలవుతుంటే ఇక్కడ ఎందుకు సాధ్యం కాదన్నారు హామీలు ఇచ్చి తప్పించుకుందామంటే మరో తెలంగాణ ఉద్యమాన్ని చూస్తారు, తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ లీడర్లను బట్టలు ఇప్పించి ఉరికించి కొట్టింది మరువకురి మల్లాది రిపీట్ కావొద్దు అంటే బీసీలకు 42% రిజర్వేషన్స్ ఇవ్వాలి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే బీసీ స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చూడటం అత్యంత దుర్మార్గం అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేసి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే బీసీలు కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశ వ్యాప్తంగ బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో చెప్పినందుకే..కాంగ్రెస్ పార్టీకి 99 ఎంపీ సీట్లు దక్కిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గతంలో బీసీలను మోసం చేసినందుకే దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరమైందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా మరోసారి బీసీలను మోసం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తున్నారని, అదే జరిగితే.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పుట్టగతులు లేకుండా పోతుందని అన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీలో పెట్టిన బీసీ బిల్లుకు జీవో తీసి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కులగణనలో దేశానికి ఆదర్శంగా నిలిచిన బీహార్ రాష్ట్రాన్ని మోడల్ గా తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఏది ఏమైనా..కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచైనా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసేలా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు వచ్చేలా కుల సంఘాలన్నీ ఏకతాటి మీదిగా ఉండి పని చేయాలన్నారు ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, మహిపాల్ రెడ్డి, మోట నవీన్ కుమార్, పులిగిల్ల కృష్ణయ్య, ఆకిటి శివ,మోటి శివ, సాయి, మల్లేష్, విష్ణుమూర్తి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# బీసీ ల ముద్దుబిడ్డ టైగర్, రాజ్యసభ సభ్యులు ఎం పీ ఆర్ కృష్ణన్నను ను కలిసిన బీసీ సేన నాయకులు



**సి కే న్యూస్ షాద్ నగర్:, జూన్ 25**: జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణన్న ఆధ్వర్యంలో నేడు బీసీ జాతి ముద్దుబిడ్డ టైగర్ రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణన్న గారిని కలిసి శాలువలతో సన్మానించారు అనంతరం బీసీల హక్కుల సాధన కొరకు బీసీ సేన గ్రామస్థాయి కమిటీలు కార్యాచరణ గురించి చర్చించారు ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్ బీసీ సేన నాయకులు నేరెట్ల మహేందర్ గౌడ్ షాబాద్ మండల అధ్యక్షులు దయాకర్ చారి ఉపాధ్యక్షులు మీరంపల్లి బాలరాజ్, గడ్డమీద వెంకటయ్య మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ కడుమూరు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.






**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ సుజాతనగర్ ప్రతినిధి, (సాయి కౌశిక్),జూన్ 25,**మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. యువత,విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యసాధనకై కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణకై అవగాహనా వారోత్సవాలలో భాగంగా సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో వేపలగడ్డ నందు గల ధన్వంతరీ ఫార్మసీ కళాశాల నందు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ తెలిపారు. విద్యార్థులదృష్టి తమ భవిష్యత్తు జీవిత లక్ష్యం పై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు, యువత ఆకర్షితులు కావద్దని జిల్లా అన్నారు. గంజాయి, డ్రగ్స్ అలవాటు వలన శారీరక మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలన గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం పోలీసు శాఖ కృషి చేస్తోందని అందులో బాగంగా విద్యాసంస్థలు,గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మత్తుకు బానిస అవడానిని అనేక కారణాలు ఉంటాయి పరిసరాల ప్రభావం,చెడు స్నేహితులు, సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దని గంజాయి, డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు, యువత గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత, విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని తెలిపారు. డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. యువత యొక్క ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతున్న వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం 2 టౌన్ సీఐ ప్రతాప్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సీఐ కరుణాకర్, 3టౌన్ సీఐ శివప్రసాద్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము, సుజాత నగర్ ఎస్సై రమాదేవి కళాశాల ఛైర్మన్ అరికెల భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.




# అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించండి..

**సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన...**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 25,** అమెరికా అండతో పాలస్తీనా, ఇరాన్లపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తీవ్రంగా ఖండించాలని సిపిఎం భద్రాచలం పట్టణం కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఇజ్రాయిల్ ఏకపక్షంగా పాలస్తీనా ఇరాన్ దేశాలపై యుద్ధం చేస్తోందని ఈ యుద్ధానికి మద్దతుగా అమెరికా నిలబడడం సరైనది కాదని అన్నారు. ఇరాన్ అను పరీక్షలు నిర్వహిస్తోందని నెపంతో అమెరికా కూడా యుద్ధంలో పాల్గొనడం అత్యంత హేయమైన చర్యాఅని విమర్శించారు. ఐక్య రాజ్యసమితి చెబుతున్న పట్టించుకోకుండా యుద్ధం కొనసాగించడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అని అన్నారు. యుద్ధం వల్ల పాలస్తీనాలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆహారం దొరకకపోవటం వల్ల ఇసుక తింటున్నామని ఓ పసిపాప సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం కలచి వేస్తోందని అన్నారు.. గత అనేక సంవత్సరాలుగా భారతదేశం ఇరాన్ కు అండగా ఉంటూ తన అలీనా విధానంను అమలు పరిచిందని, నేడు కేంద్రంలోని బిజెపి, ప్రధాని నరేంద్ర మోడీ నోరు మెదపకపోవడం సోచనీయమని అన్నారు. తక్షణమే యుద్ధం ఆపాలని చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని కోరారు.. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా,పట్టణ కార్యదర్శులకు సభ్యులు వై వెంకట రామారావు, పి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, జీవనజ్యోతి, ఏ రత్నం, కుంజా శ్రీనివాస్, నాగరాజు, అజయ్ కుమార్, కనక శ్రీ, చాట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..

# ఇల్లందు ఎస్హెచ్ఓ సస్పెన్షన్ .

**ఫిర్యాదుదారులతో దురుసు ప్రవర్తనకు ఐజీ కఠిన చర్యలు.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్)జూన్ 25,**పోలీసు స్టేషన్లో ఫిర్యాదుదారుల తో దురుసుగా ప్రవర్తించి, వారి హక్కులను కాలరాసిన ఇల్లందు ఎస్హెచ్ఓ సత్య నారాయణకు ఊహించని షాక్ తగిలింది. మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ సత్య నారాయణను వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భార్యాభర్తల మధ్య వివాదం కేసులో ఫిర్యాదు చేయడానికి వచ్చిన భర్త తల్లిదండ్రులతో సత్యనారాయణ అమర్యాద పూర్వకంగా, దురుసుగా వ్యవహరించి, వారి గౌరవాన్ని దెబ్బతీశారన్న ఆరోపణలు ఈ సస్పెన్షన్కు కారణమయ్యాయి.

ఈ ఘటన జిల్లా పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ప్రజల హక్కులను కాపాడాల్సిన పోలీసు అధికారి, బాధితులతోనే దుర్మార్గంగా ప్రవర్తించడం సమాజంలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ సందర్భంగా ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "పోలీసు స్టేషన్కు ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రతి ఒక్కరూ గౌరవప్రదమైన వ్యవహారానికి అర్హులు. ఏ పోలీసు అధికారి లేదా సిబ్బంది అమర్యాదగా, దురుసుగా ప్రవర్తిస్తే వారి పై శాఖాపరమైన విచారణ జరిపి, కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదు," అని హెచ్చరించారు.

ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జిల్లా పోలీసు శాఖలో కీలక పరిణామంగా మారాయి. ప్రజల్లో నమ్మకం పెంచాల్సిన పోలీసు వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. సీఐ సత్యనారాయణ దుర్వ్యవహారం గురించి స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. "పోలీసు అధికారులు బాధితుల పట్ల సానుభూతితో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఇలాంటి ప్రవర్తన ఖచ్చితంగా శిక్షార్హమే," అని పలువురు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఘటనతో పోలీసు శాఖలో క్రమశిక్షణ, బాధ్యతల పై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం, శాఖలో సంస్కరణలకు నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ప్రైవేట్ బడుల ఫీజు దోపిడీ ఆపాలి:- ఆర్టిఐ పర్యవేక్షణ రాష్ట్ర అధ్యక్షుడు అనంత చారి



**సీకే న్యూస్ వేములపల్లి (మిర్యాలగూడ)జూన్25 :** ప్రస్తుత విద్యా సంవత్సరంలో మిర్యాలగూడ ప్రాంతంలో ప్రైవేటు బడుల అధిక ఫీజు వసూళ్లతో సదరు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలు కావలసి వస్తుందని ఆర్టిఐ పర్యవేక్షణ పర్యవేక్షణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు నారా బత్తుల అనంత చారి ప్రైవేట్ బడుల దోపిడిని విమర్శించాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సదరు తరగతులకు ఏ ఏ రేట్ల ప్రకారం ఫీజులు వసూలు చేయాలో ఆ రెట్ల ప్రకారమే వసూలు చేసేలా హుకుంజారి చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం మిర్యాలగూడ ప్రాంతంలో వివిధ ప్రైవేట్ పాఠశాలలో వారు నిర్ణయించిన ఫీజులు ముక్కులు పిండి వసూలు చేస్తున్నారని అదే కాకుండా నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్,స్కూల్ యూనిఫామ్స్ వారి దగ్గరే కొనేలా ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. వెంటనే డివిజన్ విద్యాశాఖ వారు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్నవారు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు


# దూసకల్ లో బీసీ మహిళ కమిటీ ఏర్పాటు

- ఫారుక్ నగర్ మండల బీసీ సేన అధ్యక్షురాలు జక్కుల జలజ గారి ఆధ్వర్యంలో



**సి కె న్యూస్ షాద్ నగర్: జూన్ 25:**సామాజిక వర్గాలను విభజిస్తూ నాయకులు వారి పబ్బం గడుపుకుంటున్నారనీ బీసీ సేన కమిటీ నీ బలంగా ఉంచుదామని అన్నారు. వారు మాట్లాడుతూ దుస్కల్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా వడ్డే చంద్రకళ ఉపాధ్యక్షురాలు అల్వాల్ శశికళ గౌడ్
ప్రధాన కార్యదర్శి వేనేల జ్యోతి ముదిరాజ్, కార్యదర్శి కోడి గంటి వినోద , సహాయ కార్యదర్శి హౌస్ ల వరలక్ష్మి, కోశాధికారి గంధాల సంధ్య ముదిరాజ్, ప్రచార్య కార్యదర్శి నక్క లక్ష్మమ్మ ఎన్నుకోవడం జరిగింది.రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగక పోవడానికి కారణం సామాజిక వర్గాలను విభజిస్తూ నాయకులు వారి పబ్బం గడుపుకుంటున్నారు. ఓట్లు బీసీలవి సీట్లు అగ్రవర్ణాలవి బీసీ వర్గాలలో ఆర్థిక అసమానతలు ఉండడం వల్లనే బీసీలు ఎదగలేక పోతున్నారు అని ఆవేదన వెల్లుబుచ్చారు.
ఈ కార్యక్రమంలో
నియోజకవర్గ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప ప్రధాన కార్యదర్శి భూశ%శీ% నరేష్ నియోజకవర్గ బీసీ సేన మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి జిల్లా నాయకులు మేకల వెంకటేష్ దూసుకెళ్ బీసీ సేన అధ్యక్షులు హరి ప్రసాద్ ఏం శివ , ఫరక్ నగర్ అధ్యక్షులు ఫరూక్నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతి రాజ్
షాద్ నగర్ టౌన్ అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి గౌడ్
నందిగామ మండల ఉపాధ్యక్షులు నర్సింలు
మరియు దుస్కల్ గ్రామ ప్రజలు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేత



**సికె న్యూస్ వేములపల్లి జూన్ 25 :** వేములపల్లి మండల కేంద్రంలో స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో పిటిఐ(ఆర్ట్ ) టీచర్ గా పని చేసుకుంటూ ఉంటున్న వేములపల్లి గ్రామానికి చెందినటువంటి బోస్కా చిన్న సైదులు హటార్మరణం మరణం చెందడంతో దానికి సానుభూతిగా వేములపల్లి తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 27,700 రూపాయలు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కంచర్ల మహేందర్,ములుగురి కృష్ణ, చంద్రశేఖర్,కొండయ్య,పుష్పలత, లక్ష్మి,వాసంతి,పద్మ,మాధవి,పద్మ, నాగరాజు,వెంకన్న,పుల్లయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు

## బూర్గంపాడు మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు....



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూన్ 25,**పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం బూర్గంపాడు మోతే పట్టి నగర్, ఇరవెండి గ్రామాల లో నూతనంగా ఒక కోటి 43 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన. బీటీ రోడ్డు, సిసి రోడ్లు ప్రారంభోత్సవం చేశారు. రోడ్ల ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య మంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం అన్నారు.

అనంతరం, ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ ఇందిరమ్మ గృహాల నిర్మాణం ద్వారా నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

## షాద్ నగర్ కుంగ్ ఫు మాస్టర్ అహ్మద్ ఖాన్ కు దక్కిన అరుదైన గౌరవం

వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫాండేషన్ అవార్డు సొంతం




**సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 25:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కోచ్, మాస్టర్ అహ్మద్ ఖాన్ కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టత్మకైనా వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫాండేషన్ అధ్వర్యంలో హైదరాబాద్ లోని ఏఎస్ రావు నగర్ కమ్యూనిటీ హాల్ ఈసీఐఎల్ పార్క్ లో నిర్వహించిన వరల్డ్ చారిటీ అవార్డ్స్ సర్మనీ లో షాద్ నగర్ న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ కు కుంగ్ ఫు, మార్షల్ ఆర్ట్స్ లో నైపుణ్యం ప్రదర్శించిన సందర్భంగా బెస్ట్ కోచ్ అవార్డు దక్కింది. చిన్నప్పటి నుండి కరాటే, కుంగ్ ఫు పై ఆసక్తి తో కేశంపేట మండలం నుండి షాద్ నగర్ కు వచ్చి మాస్టర్ బాలరాజ్ వద్ద కుంగ్ ఫు లో మెలుకువలు నేర్చుకొని పైకేదుకుతూ ఇప్పుడు షాద్ నగర్ లో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ పెట్టి ఎంతోమంది చిన్నారులు, మహిళలకు కుంగ్ ఫు లో శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తూ జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి లో ఎన్నో అవార్డులు, మెడల్స్ సాధించి షాద్ నగర్ కు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిన మాస్టర్ అహ్మద్ ఖాన్ గురించి ఎంత చెప్పిన తక్కువే అవుతుంది. కుంగ్ ఫు విద్యార్థులకు క్రమశిక్షణ తో పాటు కర్రసాము, నాన్చాక్, సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేయాలో నేర్పుతు వారి జ్ఞాపకశక్తి ని పెంపోందిస్తూ ముందుకు సాగుతున్న తీరు అమోఘం. ఈ సందర్భంగా అతని పనితిరును గుర్తించి ప్రతిష్టత్మకమైన వరల్డ్ చారిటీ అవార్డు ను అతనికి అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ తనను వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫాండేషన్ వారు గుర్తించి అవార్డు అందజేయడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా వరల్డ్ వెల్ఫేర్ ఫాండేషన్ వారికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇకముందు కూడ చిన్నారి విద్యార్థుల కు, మహిళలకు కుంగ్ ఫు లో తర్ఫిదు ఇస్తూ ముందుకు సాగుతూ షాద్ నగర్ పేరు జాతీయ, అంతర్జాతీయ స్థాయి లో నిలబెట్టడానికి సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# జూలై 24న భవన నిర్మాణ అసంఘటిత కార్మికుల మహాధర్నా

● జేఎస్టీయూసీ కరపత్రం ఆవిష్కరించిన కేఎస్ఆర్ గౌడ్

**సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 25:**



భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులు శ్రమ దోపిడికీ గురవుతున్నారని, వారికి చట్టాలు ఉపయోగపడటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ అసంఘటిత కార్మికుల మహాధర్నా జూలై 24న హైదరాబాద్ లో ఇందిరాపార్కు వద్ద జై స్వరాజ్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు సంభందించిన కరపత్రాన్ని ఆయన హైదరాబాదులోని మెట్టుగూడలో ఉన్న జై స్వరాజ్ పార్టీ కార్యాలయంలో జేఎస్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గోలుకొండ రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంజ గణేష్, కార్యదర్శి మాటూరి కృష్ణ మోహన్, పార్టీ జాతీయ కార్యదర్శి ఆర్ ఎస్ జే థామస్, జై స్వరాజ్ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మర్ల ఆంజనేయులు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జేఎస్టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోలుకొండ రత్నం మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి లేబర్ కార్డులు కొనసాగించాలని, 60 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి నెలకు 5 వేల రూపాయల ఫించన్ ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు నెలలో కనీసం పది రోజుల పని దినాలు కల్పించాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, సహజ మరణాలకు 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని తదితర డిమాండ్లతో హైదరాబాద్లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు ఇతర కార్మిక సంఘాలు సంఘీభావం తెలపడంతో పాటు ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఎస్టీయూసీ నాయకులు జయరాజ్, రాజ్ కుమార్, కలకోట సుధాకర్, దూడపాక శ్రీహరి , రేష్మా , ఖాజా, రాము, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## చేగుంట పోలీస్ స్టేషన్ ను సందర్శించిన, జిల్లా ఎస్పీ

**జూన్ 25 (సి కె న్యూస్) చేగుంట** :చేగుంట పోలీస్ స్టేషన్ ను ఆకస్మతుగా తనిఖీ చేసిన మెదక్ జిల్లా ఎస్పీ, చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ చైతన్య కుమార్ రెడ్డి ని వివరాలు అడిగి తెలుసుకున్నారు పోలీస్ స్టేషన్ కు వస్తున్న ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తున్నారని వివరాలు అడిగారు పోలీస్ స్టేషన్ పనితీరును పరిశీలించడం సిబ్బందితో సమీక్ష నిర్వహించడం మరియు స్టేషన్ లోని సమస్యలను పరిష్కరించడం సిబ్బందికి సూచనలు పోలీస్ స్టేషన్ లోని సిబ్బందికి సూచనలు, పోలీస్ స్టేషన్లోని సిబ్బందికి మార్గదర్శకాలు అందించడం వల్ల వారు తమ విధులను సమర్ధంగా నిర్మించగలరు స్టేషన్ పరిస్థితులను కూడా వారు అడిగి తెలుసుకున్నారు పోలీస్ స్టేషన్ లోని పరిస్థితులను సౌకర్యాలను పరికరాలు మరియు సిబ్బంది పనితీరు మొదలైన అన్నిటిని అడిగి తెలుసుకోవడం జరిగింది, ప్రజలకు పోలీస్




స్టేషన్ కు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ప్రజలతో జాగ్రత్తగా వహించాలని వారు సూచించారు, ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ, చేగుంట సబ్ ఇన్స్పెక్టర్ చైతన్ కుమార్ రెడ్డి, ఇన్స్పెక్టర్, మరియు పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు

# బిజెపి పార్టీ బడాబాబుల కార్పొరేట్ పార్టీ..

- మీరా ఇందిరమ్మ గురించి మాట్లాడేది..
- బిజెపి హయాంలో 11 ఏళ్లుగా ఎమర్జెన్సీ..
- 50 ఏళ్ల క్రితం జరిగింది తవ్వడం కాదు ఇప్పుడు మీరేం చేస్తున్నారో చెప్పండి..
- పత్రికా స్వేచ్ఛను నేలమట్టం చేసింది మీరు కాదా..? మీ హయాంలోనే మహిళలకు రక్షణ కరువైంది..
- పాకిస్తాన్ యుద్ధంలో తోక ముడిచింది మీ మోడీ కాదా..?
- ఆనాడు ధైర్యంగా పోరాడింది మా ఇందిరమ్మ కాదా..
- కాంగ్రెస్ నిరుపేదల పార్టీ మమ్ములను గెలకొద్దు ఇలాగే ఉంటది..
- షాద్ నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లింగారెడ్డిగూడెం అశోక్..

**సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 25:**అయ్యా భారతీయ జనతా పార్టీ నాయకులారా.. అప్పుడెప్పుడో శతాబ్దాల క్రితం సమాధిలోకి వెళ్ళిన ఔరంగాజేబ్ తో మొదలుపెట్టి.. 50 ఏళ్ల క్రితం పాలించిన ఇందిరమ్మ వరకు పాత విషయాలను తవ్వడమే మీకు పనా.. ఎప్పుడు ఇదేనా.. కొంచెం కూడా బోర్ కొట్టదా..

ఆనాడు ఇందిరమ్మ ఎమర్జెన్సీ గురించి మాట్లాడుతున్నారే.. మరి ఇప్పుడు 11 సంవత్సరాలుగా మీ హయాంలో జరుగుతున్నది ఏమిటి.. ఎమర్జెన్సీ కాదా.. మీ హయాంలో కనీసం జర్నలిస్టులకు ఉన్నది ఉన్నట్లు రాసే స్వేచ్ఛ ఉందా..? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పండి..

సామాన్యంగా ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలి.. కానీ మీ హయాంలోనే మహిళలకు రక్షణ లేదు.. మహిళా బాక్సర్ల పట్ల బ్రి భూషణ్ శర్మ వ్యవహరించిన తీరు నుంచి నిన్న మొన్నటి దాకా ఓ బీజేపీ నేత రాసలీలలు దాకా మీ లీలలు ఎన్నో వెలుగులోకి రాలేదా..

మాట మాట్లాడితే సంస్కృతి, సంప్రదాయం అని చెబుతుంటారు.. కానీ దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ అంబేద్కర్ లాంటి మహానీయులను మీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా అత్యంత దారుణంగా ట్రోల్ చేస్తున్నది మీరు కాదా.. ఇదేనా మీ సంస్కృతి.. ఇదేనా మీ సంప్రదాయం..

అన్నదమ్ములలా కలిసిమెలిసి ఉంటూ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మన లౌకికదేశంలో ముస్లింలను, క్రైస్తవులను వేరు చేస్తూ మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నది మీరు కాదా.. ఒట్టేసి నిజం చెప్పండి..

ఇందిరమ్మ గురించి మాట్లాడుతున్న బిజెపి నాయకులూ.. మొన్న పాకిస్తాన్తో యుద్ధం విషయంలో మీ మోదీ అర్ధాంతరంగా ఎందుకు తోక ముడిచాడో.. సమాధానం చెప్పగలరా.. 1971లో అమెరికా మధ్యవర్తిత్వాన్ని పక్కన పెట్టి పాకిస్థాన్ ను పరుగులు పెట్టించిన ఇందిరమ్మ సాహసం గుర్తు లేదా..

బిజెపి హయాంలో మతవిద్వేశాలు తప్ప ప్రజలకు ఒరిగింది ఏమిటి.. పిల్లల పాల ప్యాకెట్ల మీద కూడా జీఎస్టీ విధించిన ఘనత మీది.. 50 రూపాయల పెట్రోల్ నూ సెంచరీ దాటించిన చరిత్ర మీది.. మన్మోహన్ సింగ్ తీర్చిదిద్దిన ఆర్థిక వ్యవస్థను అంధకారంలోకి నెట్టిన ఘనత మీది.. మీరు మా గురించా ప్రశ్నించేది..

సంవిధాన్ హత్య దివాస్ పేరిట ఎప్పుడో 50 ఏళ్ల క్రితం అరెస్ట్ అయిన వారికి సన్మానాలు చేసిన బిజెపి నాయకుల్లారా మీకు నిజంగా మానవత్వం ఉంటే మణిపూర్ కు వెళ్ళండి.. అక్కడ ప్రాణాలు కోల్పోయిన కుటుంబ సభ్యులను పలకరించండి.. కాశ్మీర్లో ఉగ్రవాదుల చేతుల్లో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించండి.. మీరు బిల్డప్ బాబులు అని జనాలకు కూడా అర్థం అయిపోయింది.. ఇక మీరు ఎన్ని డ్రామాలు చేసిన జనం నమ్మరు.. ఇలాంటి గ్రామాలను ఇకనైనా ఆపి ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి.. అంటూ లింగారెడ్డిగూడెం అశోక్ పత్రిక ప్రకటన విడుదల చేశారు..



## చేగుంట జడ్పిహెచ్ఎస్ స్కూల్లో చైల్డ్ మ్యారేజ్ అవేర్నెస్ అవగాహన సదస్సు ముఖ్య అతిథి చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి




**జూన్ 25 (సీకే న్యూస్ ) చేగుంట:**చేగుంట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్లో చైల్డ్ మ్యారేజ్ మరియు మాదక ద్రవ్యాల అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు, చేగుంట ఎస్సై చైతన్యకుమారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రమాదకరమైన ద్రవ్యాలకు దూరంగా ఉండడం మంచిది విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నంత స్థాయికి ఎదగాలి మీరు మీరు అనుకున్నది సాధించేవరకు పట్టుదలతో ఉండి యువత ముందుకు చేరినప్పుడే, మీ తల్లిదండ్రులకు, మీరు పాఠశాలకు మంచి పేరు తెచ్చిన వారవుతారని, అని వారు అన్నారు, ప్రమాదకరమైన ద్రవ్యాలకు సమాజానికి దూరంగా ఉండాలని వారు వారికి సూచించారు, ఈ కార్యక్రమంలో జెడ్ పి హెచ్ ఎస్ మున్సిపల్, చేగుంట ఎస్సై ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## షాద్ నగర్ లో బిజెపి ఆధ్వర్యంలో సంవిధాన్ హత్య దివస్ అభియాన్ ఎమర్జెన్సీలో జైలుకెళ్ళిన ఉద్యమకారులకు, జర్నలిస్టులకు సన్మానం





**సి కే న్యూస్ షాద్ నగర్:జూన్ 25:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఏబికాంప్లెక్స్ లో జరిగిన సంవిధాన్ హత్య దివస్ అభియాన్ కార్యక్రమానికి బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో ఆనాడు జైలుకెళ్లిన ఉద్యమకారులను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆనాడు మీడియా గొంతు నొక్కిన ఇందిర గాంధీ ప్రభుత్వ నిరంకుశ ధోరణినీ గుర్తు చేస్తూ నేటి జర్నలిస్టు ప్రతినిధులకు బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానాలు నిర్వహించారు. ఆనాడు రాజ్యాంగంలో ప్రధానమైన ఆరు చట్టాల కారణంగా నేడు పౌరుడు స్వేచ్ఛగా జీవిస్తున్నాడని గుర్తు చేశారు. ఆనాడు ఎమర్జెన్సీలో కోటి మందిని ఆనాటి ఇందిరా ప్రభుత్వం కుటుంబ నియంత్రణ చికిత్సలు బలవంతంగా చేసిందని గుర్తు చేశారు. పార్లమెంట్ ఆమోదం లేకుండా ప్రజల పట్ల కిరాతకంగా ఇందిరా ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. 15 ఏళ్ల మైనర్ బాలుడిని కూడా ఆపరేషన్ చేశారని గుర్తు చేశారు. ఒక మురికివాడపై పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి వందలాది మందిని చంపితే జనతా ప్రభుత్వం వచ్చాక ఆ విషయం వెలుగు చూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ నడిబొడులో ప్రజలను ఎన్కౌంటర్ చేసిన పాపం కాంగ్రెస్ ఎమర్జెన్సీ ప్రభుత్వాన్నిదని విమర్శించారు. రాజ్యాంగం ఎంతో చక్కగా అమలు చేస్తున్న భారతదేశం నాదేశం అని ఎంతోమంది గర్వంగా చెప్పుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఏబి కాంప్లెక్స్ లో ఎమర్జెన్సీలో జైలు జీవితాన్ని అనుభవించిన స్థానికులు కందూరి కృష్ణారెడ్డి, బాల్ రెడ్డి, రఘుపతి రెడ్డి, వీరాంజనేయులు గౌడ్, మహమ్మద్ జామిలను ప్రత్యేకంగా సన్మానించారు. అదేవిధంగా స్థానిక జర్నలిస్టులు లట్టుపల్లి మోహన్ రెడ్డి,రాజేష్,సారాపు రమేష్,భాస్కర్, రాకేష్, జగన్, శేఖర్ గౌడ్, మల్లికార్జున్, సమి, కృష్ణ, తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమం బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో జరగగా ఈ కార్యక్రమానికి ఇన్చార్జిగా అందే బాబయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్ దేపల్లి అశోక్ గౌడ్ కమ్మరి భూపాల్ చారి కందూరు మనోహర్ రెడ్డి నందిగామ వెంకటేష్, ప్రశాంత్ తదితరులు హాజరయ్యారు..

# విశ్వభారతి జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనకు కార్యక్రమం

**డ్రగ్స్ వాడకంపై విద్యార్థుల్లో చైతన్యం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో చిత్రలేఖనం**

**డ్రగ్స్ ఎంత ప్రమాదమో తెలియజేసిన షాద్ నగర్ పట్టణ సీఐ విజయకుమార్**



**సి.కె న్యూస్షాద్ నగర్: జూన్ 25:** మారక ద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడి యువత వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అంటూ... డ్రగ్స్ వాడకాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులలో చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో షాద్ నగర్ పోలీసులు స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వాడకంపై ప్రజల జీవితాల పై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలియజేసేలా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు..

ప్రస్తుత సమాజంలో యువత డ్రగ్స్ కు బానిసలు కాకుండా.. వారి జీవితాన్ని కాపాడుకోవాలని... డ్రగ్స్ వాడకం వల్ల యువత నాడీ వ్యవస్థ మీద వారి ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపి చనిపోయే ప్రమాదం కూడా ఉందని... దీనివల్ల వారి కుటుంబం విదినపడే అవకాశం ఉందని..కాబట్టి విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని... స్థానిక సిఐ విజయ్ కుమార్ విద్యార్థులకు తెలిపారు... ప్రస్తుతం ఈ డ్రగ్స్ వాడకం అనేది రకరకాల పద్ధతుల ద్వారా అనగా చాక్లెట్స్ రూపంలో...ఇంజక్షన్స్ రూపంలో.. పౌడర్ రూపంలో.. ఇలా వినూత్న పద్ధతుల ద్వారా పంపిణి చేయబడుతుందని...

ఈ డ్రగ్స్ పంపిణీ విషయంలో మీకు తెలిసిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలంటూ ఆయన విద్యార్థులను కోరారు..

ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ విజయ్ కుమార్ తో పాటు... స్థానిక ఎస్సై ప్రణయ్ కుమార్.. కళాశాల యాజమాన్య సభ్యులు పార్థసారథి.. మధుసూదన్.. మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..

# టిబి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి...



**-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ**

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూన్- 25**

టిబి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటో డివిజన్ కైకొండాయిగూడెం లో ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెగా హెల్త్ క్యాంపు ను అదనపు కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం 2025 నాటికి దేశాన్ని టి.బి. రహితంగా మార్చాలనే లక్ష్యంతో "టి.బి. ముక్త్ భారత్ అభియాన్" ప్రారంభించిందన్నారు. ఈ అభియాన్‌లో భాగంగా ప్రతి టి.బి. బాధితుడిని గుర్తించి, వారికి సరైన వైద్యం, పోషకాహారం, మద్దతు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం టి.బి. రోగుల కోసం "నిక్షయ్ పోషణ యోజన" పేరిట నెలకు 500 రూపాయల పోషకాహార భత్యాన్ని అందిస్తోందని, అలాగే అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. "నిక్షయ్ పోర్టల్" ద్వారా టి.బి. రోగుల రిజిస్ట్రేషన్, ఫాలో అప్ నిర్వహించబడుతోందని అదనపు కలెక్టర్ తెలిపారు.

టి.బి. వ్యాధి నివారణకు సమాజం కూడా భాగస్వామ్యం కావాలని, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్ష చేయించుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. టి.బి. బాధితులను వివక్షతో చూడకూడదని, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మద్దతు ఇవ్వాలని, వారు మందులు పూర్తిగా తీసుకునేలా చేయడం అత్యంత అవసరమని అన్నారు.

టి.బి. పూర్తిగా నయమయ్యే వ్యాధని, దీనికి సరైన సమయంలో గుర్తింపు, నిరంతర వైద్యం అవసరమని, మనం ప్రతి ఒక్కరం జాగ్రత్తగా ఉండటం ద్వారా టి.బి. వ్యాధిని నివారించగలమని అదనపు కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, గ్రానైట్ అసోసియేషన్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాలతో కాలాన్ని పరుగులు పెట్టించగల కవి ఆచార్య ఎన్.గోపి

- ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నల్లా నరసింహమూర్తి



**అమలాపురం సికె న్యూస్ ప్రతినిధి** జీవితంలో నూ కవిత్వంలోనూ నిజాయితీని నిత్య చైతన్యాన్ని నింపుకున్న కవిశిఖరం , అక్షరాలతో కాలాన్ని పరుగులు పెట్టించగల కవి ఆచార్య ఎన్. గోపి అని అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సంస్థ శ్రీ శ్రీ కళావేదిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల తెలుగు అధ్యాపకుల సంఘం గౌరవ ఉపాధ్యక్షులు, సీనియర్ తెలుగు లెక్చరర్,ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నల్లా నరసింహమూర్తి అన్నారు. బుధవారం అమలాపురం డాబా గార్డెన్స్ లో శ్రీ శ్రీ కళావేదిక జిల్లా శాఖ , కోనసీమ రచయితలసంఘం ,

నానీలవేదిక సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎన్ .గోపి జన్మదినం సందర్భంగా జరిగిన సాహిత్య సభలో నరసింహమూర్తి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య ఎన్. గోపి ఐదు దశాబ్దాలుగా తెలుగు పాఠకుల గుండెల్లోకి కొత్త కొత్త భావాలతో నడిచిపోతున్న కవి అని ఆయన అన్నారు. ఆయన రచించిన తొలి కవితా సంపుటి తంగేడు పూలు ఆనాటి గ్రామీణ జీవితానికి పచ్చని ప్రతీక అని ఆయన అన్నారు. సహృదయత ,స్నేహం, సౌశీల్యం, ఆదరణ ,ప్రేమ ,ఆప్యాయతల అనురాగ సంగమం ఆచార్య గోపి వ్యక్తిత్వమని నల్లా అన్నారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ కవి డాక్టర్ బీవీవి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నానీలు సృష్టికర్తగా తనదైన ముద్రను వేసుకున్నారని ఆయన అన్నారు. మనిషి మీద అపారమైన ప్రేమతో సత్యాన్వేషణతో అనురాగ స్పర్శతో నానీలు కవిత్వంలో చెప్పాలనేతాపత్రం ఆయన రచించిననానీల కవిత్వంలో కనిపిస్తుందని ఆయన అన్నారు. . కవి నల్లా నరసింహమూర్తి రచించిన " గోపి నానీలు.. ఒక పరిశీలన" వ్యాసాన్ని చదివి వినిపించారు.. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలను హై స్కూల్ విద్యార్థులకు కళాకారుడు లవకుశ చిత్రంలో కుశుడు పాత్రధారి ఉయ్యూరు నాగ సుబ్రహ్మణ్యం, శ్రీశ్రీ కళావేదిక జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున సత్యనారాయణ అందజేశారు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు నగదు పురస్కారాలు డాక్టర్ శ్రీపాద రామకృష్ణ అందజేశారు.. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో నల్లానరసింహమూర్తి, బివి వి.సత్యనారాయణ ,మాకే బాలార్జున సత్యనారాయణ,, కడలి సత్యనారాయణ, ముత్యాల శరత్ బాబు,డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, పోలిశెట్టి అనంతలక్ష్మి దేవి,దొడ్డి సత్య వేణి కవితా గానం చేశారు

# విశాఖ ఉక్కు పోరాటం: ప్రైవేటీకరణపై కార్మికుల ఆగ్రహం - 1595 రోజుకు చేరిన నిరసన దీక్షలు

**ఉక్కునగరం సికె న్యూస్ ప్రతినిధి** విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటానికి కొనసాగుతున్న మద్దతు – సీఐటీయూ ఆధ్వర్యంలో 1595వ రోజు రిలే నిరాహార దీక్ష

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 1595వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్ సిఐటియు కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా సిఐటియు అధ్యక్షులు కె.ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో రెండు కీలక విభాగాలను ప్రభుత్వ ఆదేశాలతో ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఈ ప్రైవేటీకరణ వల్ల స్టీల్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, ఉత్పత్తి వ్యయం పెరిగి ప్లాంట్‌కు భారీ నష్టాలు వస్తాయని ఆయన వివరించారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు ఇప్పుడు దానిని విస్మరించి ప్రైవేటీకరణకు సహకరిస్తున్నారని ఆయన విమర్శించారు. గత నాలుగు సంవత్సరాలుగా కార్మికులు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పటికీ, వారిపై తీవ్ర నిర్బంధం, ఆంక్షలు విధించడం సమంజసం కాదని శ్రీనివాస్ అన్నారు. ఈ నిరసనల వల్ల ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగలేదని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేదని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటంలో రాష్ట్ర ప్రయోజనాలు, నిరుద్యోగులకు ఉపాధి, రాష్ట్ర అభివృద్ధి ఇమిడి ఉన్నాయని, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఈ పోరాటానికి మద్దతు ఇస్తామని వాగ్దానం చేసిన పాలకులు తమ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా సిఐటియు నాయకులు ఎం. రామారావు మాట్లాడుతూ, ప్లాంట్‌లోని సెంటర్ ప్లాంట్ ద్వారా స్టీల్ ఉత్పత్తికి అవసరమైన సెంటర్ లభిస్తుందని, దీని స్థానంలో పైలెట్స్ ద్వారా ఉత్పత్తి జరిగితే సుమారు 4000 నుంచి 6000 వరకు అదనపు భారం పడుతుందని వివరించారు. బ్లాస్ట్ ఫర్నేస్-3 ప్రారంభోత్సవానికి వస్తున్న స్టీల్ సహాయ కార్యదర్శి, స్టీల్ ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై యాజమాన్యం, కార్మిక సంఘాలతో సమావేశమై పరిష్కారాలను సూచించడం పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయమని ఆయన గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం స్టీల్ యాజమాన్యం గానీ, స్టీల్ మంత్రిత్వ శాఖ గానీ అలాంటి చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయాలతో స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. స్టీల్ సహాయ కార్యదర్శి ఈ దిశగా ఆలోచించి సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు యు. వెంకటేశ్వర్లు, కె. సత్యనారాయణ, పుల్లారావు, డి.ఎస్.ఆర్.సి. మూర్తి, జగ్గారావు, ఆర్. వెంకటరావు, సంతోష్ కుమార్ రాజు తదితరులతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న షాద్ నగర్ సి ఐ విజయ్ కుమార్

- మనిషన్నవాడు గొప్ప కాదు మానవత్వం ఉన్నవాడు గొప్ప
- మానవత్వం మరిచి కర్కషత్వంతో వదిలివేసిన కుటుంబీకులు....
- మానవత్వం చూపిన పట్టణ పోలీసులు
- మానవత్వానికి మరో రూపమే షాద్నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్, కానిస్టేబుల్ శ్రీను
- 80 ఏళ్ల వృద్ధురాలని ఎఫ్ సి ఎన్ ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించిన పట్టణ సీఐ విజయకుమార్





**సి.కె న్యూస్షాద్ నగర్: జూన్ 25:** కర్కషత్వంతో మానవత్వం లేని కుటుంబీకులు వద్దనుకున్నారు... అభం శుభం తెలియని 80 ఏళ్ల వృద్ధురాలిని అనాగరికంగా పట్టణ రైల్వే స్టేషన్ నుండి రైల్వే ప్లాట్ఫామ్ పై వదిలివేశారు. దయగల హృదయముగల భగవంతుడు షాద్నగర్ పట్టణ పెట్రోలింగ్ పోలీసుల కళ్ళలో ఆమెను పడేటట్లు చేశాడు. నిన్న రాత్రి పెట్రోలింగ్ డ్యూటీ నిర్వహిస్తున్న శ్రీను పోలీసులు రైల్వే ప్లాట్ ఫారంపై పై ఒక 80 ఏళ్ల ముసలావిడ ఉండడం గమనించి వెంటనే పట్టణ సీఐ కు తెలుపగా దయార్ద్ర హృదయుడు, మంచి మానవత్వం కలిగిన సిఐ విజయకుమార్ వెంటనే స్పందించి ఆమె వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా వివరాలు కూడా చెప్పలేని స్థితిలో ఉన్న ఆ ముసలావిడను మానవత్వంతో లింగారెడ్డిగూడెం సమీపంలో నేషనల్ 44 హైవే పక్కన గల ఎఫ్ సి ఎన్ ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్వాహకులతో మాట్లాడి ఆమెను ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించారు. ఇంతకుముందు కూడా సిఐ విజయ్ కుమార్ శంషాబాద్ ఏరియాలో కూడా ఇలాగే ఎంతో మంది అనాధలుగా మిగిలిపోయిన వారిని ఓల్డ్ ఏజ్ హెూమ్ లో చేర్పించినట్టు సమాచారం. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ఆదర్శంగా నిలుస్తున్న, ఖాకీ డ్రెస్ లో కూడా మానవత్వాన్ని ప్రదర్శిస్తున్న షాద్ నగర్ పట్టణ సిఐ విజయ్ కుమార్ తో పాటు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తున్న పోలీసులకు కూడా పట్టణ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారు చూపిస్తున్న మానవత్వానికి, భగవంతుని మరో రూపంగా భావిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ఖమ్మంలో బీజేపీ చైతన్య సభలకు ముహూర్తం సిద్ధంలి

- నేడు ఖమ్మంలో పర్యటించనున్న ఈటెల రాజేందర్
- ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమం అవసరం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు



**సి కె న్యూస్ ప్రతినిధి:** 1975లో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీకి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతవాటిదో నేటి పరిస్థితుల్లో మరింత స్పష్టమవుతోంది అని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరీ కోటేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈనెల 26 వ తేదీన ఖమ్మం పట్టణంలోని మినర్వా గ్రాండ్ హెూటల్‌లో జరగబోయే బీజేపీ చైతన్య సభల నేపథ్యంలో మీడియాకు వివరాలు తెలియజేశారు.

"1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి శరవేగంగా దెబ్బ కొట్టిన ఘోర చీకటి అధ్యాయంగా చరిత్రలో నిలిచిపోయింది. లక్షల మంది నాయకులను అకారణంగా జైళ్లకు తరలించారు. మౌలిక హక్కులు నిలిపివేశారు. అబద్ధాలను ప్రచారం చేశారు. అలా కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీపై బీజేపీ చైతన్యం కలిగించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే రేపు మన ఖమ్మం పట్టణంలో ఒక చారిత్రక సభ జరుగుతోంది," అని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీజేపీ ముఖ్యనేత శ్రీ ఈటెల రాజేందర్ , కేంద్ర మాజీ ఎంపీ శ్రీ ఆజ్మీరా సీతారాం నాయక్ పాల్గొంటున్నట్లు తెలియజేశారు. "ఈటెల బహుళ అనుభవం కలిగిన నాయకుడు. ఆయన ప్రసంగం ఖమ్మం ప్రజలకు ప్రేరణనిచ్చేలా ఉంటుంది. బీజేపీ గెలిచిన తర్వాత తెలంగాణలో ప్రజాస్వామ్య వ్యవస్థల పునర్నిర్మాణం ఎలా జరగాలి అనే అంశాలను ఆయన స్పష్టంగా వివరిస్తారు," అని పేర్కొన్నారు.

అదే విధంగా, మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మం నగరంలోని మినర్వా గ్రాండ్ హెూటల్లో ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందనీ, 2.30 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 3.30 గంటలకు పాలేరు నియోజకవర్గం లోని కూసుమంచి బీవీ రెడ్డి ఫంక్షన్ హాల్ లో బహిరంగ సభ ప్రారంభమవుతుందని వెల్లడించారు. సభకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.

జిల్లాలోని కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రతిఒక్కరూ ఈ చైతన్య సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గోపీచంద్ 33..ఇద్దరికీ విషమ పరీక్షే!




టాలీవుడ్‌లో ఉన్న టాలెంటెడ్, అండ్ హీమాన్ ఫిజిక్ ఉన్న హీరోల్లో గోపీచంద్ ఒకరు. హరీఓగా కెరీర్ ప్రారంభించి మళ్లీ విలన్‌గానూ నటించి ఆకట్టుకున్న గోపీచంద్ ఆ తరువాత కథానాయకుడిగా తన మార్కు సినిమాలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటూ వస్తున్నారు. అయితే ఇంత టాలెంట్ ఉన్న ఈ హీరో కమర్షియల్ హిట్ మాట విని ఏళ్లవుతోంది. – సీటీమాం– తో ఫరవాలేదు అనిపించుకున్నా కమర్షియల్ బ్లాక్ బస్టర్లని మాత్రం ఇంత వరకు సొంతం చేసుకోలేకపోయాడు.
మారుతిని నమ్మి – పక్కా కమర్షియల్ అన్నా..శ్రీవాసుని నమ్మి రామబాణం వేసినా.. కన్నడ దర్శకుడిపై నమ్మకంతో – భీమా– చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి శ్రీను వైట్ల హిట్టిస్తాడని విశ్వసిస్తే – విశ్వం– అడ్రస్ లేకుండా పోయింది. హిట్ సినిమా చేయాలని, ట్రాక్‌లోకి మళ్లీ రావాలని గోపీచంద్ చేయని ప్రయత్నం లేదు. ఈ నేపథ్యంలో తను సంకల్ప్‌రెడ్డిని నమ్మి ఓ భారీ యాక్షన్ డ్రామాని చేస్తున్నాడు. – ఘాజీ– సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపుని సొంతం చేసుకున్న సంకల్ప్‌రెడ్డి ఆ తరువాత అంతరిక్షం 9000 KMPH, హిందీతో IB71 సినిమాలు చేసి నిరాశపరిచాడు.
ఇప్పుడు హిట్టు కోసం ఎదురు చూస్తున్న గోపీచంద్‌తో కలిసి ఓ భారీ ఫాంటసీ యాక్షన్ డ్రామాకు శ్రీకారం చుట్టాడు. సిల్వర్ స్క్రీన్స్ బ్యానర్‌పై ఈ మూవీని శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. గోపీచంద్ బర్త్‌డే సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్‌తో పాటు హీరో లుక్‌ని విడుదల చేశారు. గ్లింప్స్‌లో గోపీచంద్ లుక్, ఆయన మేకోవర్, వారియర్‌గా కనిపిస్తున్న తీరు సినిమాపై అంచనాల్ని పెంచేస్తోంది. కెరీర్ ప్రారంభం నుంచి కొత్త తరహా కథలకు ప్రాధాన్యతనిచ్చే సంకల్ప్‌రెడ్డి ఈ ప్రాజెక్ట్ కోసం సరికొత్త వారియర్ కథని ఎంచుకున్నట్టుగా తెలుస్తోంది. మ్యాచో మ్యాన్‌గా పేరు తెచ్చుకున్న గోపీచంద్‌కి కావాల్సింది ఇలాంటి కథే కావడం, ఆయన గెటప్ కూడా అందుకు తగ్గట్టుగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరి దృష్టి పడింది. అయితే చాలా కాలంగా సరైన హిట్టు కోసం ఎదురు చూస్తున్న హీరో గోపీచంద్‌కు, ఘాజీ తరువాత హిట్టు మాట వినని దర్శకుడు సంకల్ప్‌రెడ్డికి ఈ ప్రాజెక్ట్ ఓ విషమ పరీక్ష అని చెప్పక తప్పదు. వీరిద్దరు చాలా కాలంగా సక్సెస్ కోసంఎదురు చూస్తున్న నేపథ్యంలో ఈ సినిమా వారి కెరీర్‌కు కీలకంగా మారనుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు సంకల్ప్‌రెడ్డి, హీరో గోపీచంద్ ఈ ప్రాజెక్ట్‌ని నెవర్ బిఫోర్ అనే స్థాయిలో తెరపైకి తీసుకురాగలిగితే అనుకున్నట్టుగా ఇద్దరూ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందుకోవడం ఖాయం.



**ఎత్నిక్ గ్లామ్‌లో శ్రీముఖి యాంక రింగ్ హార్ట్స్**



**హరి హర వీర మల్లు ప్రమోషన్స్ ప్రారంభించిన నిధి అగర్వాల్**

# తండ్రి, అన్న ఓకే.. ఇప్పుడు తమ్ముడు పెండింగ్!



తండ్రి, అన్న కమ్ బ్యాక్ ఇచ్చేశారు..తమ్ముడు మాత్రమే పెండింగ్ ఉన్నాడు.. ఇప్పుడు టాలీవుడ్ సినీ వర్గాల్లో ఇదే హాట్ టాపిక్ గా మారింది. తమ్ముడు కూడా మంచి హిట్ కొట్టేయాలని ఫ్యాన్స్ అంతా కోరుకుంటున్నారు.. ఆకాంక్షిస్తున్నారు. త్వరలోనే ఆ తమ్ముడి కొత్త సినిమా రిలీజ్ కానుండగా.. ఇప్పటికే ఆడియన్స్ లో సాలిడ్ బజ్ క్రియేట్ అయ్యే ఉంది. అక్కినేని ఫ్యామిలీ హీరోల గురించే మనం మాట్లాడుకుంటున్నామని ఇప్పటికే అర్థమైపోయి ఉంటుంది. కొంతకాలంగా సరైన హిట్ కోసం టాలీవుడ్ కింగ్ నాగార్జున, యంగ్ హీరోలు నాగచైతన్య, అఖిల్ వెయిట్ చేస్తున్నారు. రీసెంట్ గా తండేల్ తో చైతూ సూపర్ హిట్ ను అందుకోగా.. నాగార్జున తాజాగా కుబేరతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. వరుస సినిమాలు చేస్తున్న హిట్ కొట్టని నాగచైతన్య.. చందూ మొండేటి దర్శకత్వం వహించిన తండేల్ తో రూ.100 కోట్ల విజయాన్ని సాధించారు. సినీ ప్రియులను విపరీతంగా ఆకట్టుకున్నారు. తన మార్కెట్ ను కూడా ఒక్కసారిగా పెంచుకున్నారు. సింపుల్ గా చెప్పాలంటే.. తండేల్ మూవీ తర్వాత చైతూ కెరీర్ లో బిగ్ ఛేంజ్ వచ్చిందని చెప్పాలి.
అదే సమయంలో నా సామి రంగాతో భారీ విజయాన్ని సొంతం చేసుకోవాలని నాగార్జున అనుకున్నారు. భారీ వసూళ్లు రాబట్టినా అనుకున్న స్థాయిలో సక్సెస్ అవ్వలేకపోయారు. ఆ తర్వాత కాస్త గ్యాప్ ఇచ్చిన ఆయన.. కుబేరలో కీలక పాత్రలో కనిపించారు. సీబీఐ ఆఫీసర్ రోల్ లో మెప్పించారు. కత్తి మీద సాము లాంటి క్యారెక్టర్ తో ఆకట్టుకున్నారు. దీంతో అక్కినేని అభిమానులు చాలా సంతోషంగా ఉన్నారు. నాగ చైతన్య, నాగార్జున ఇద్దరూ బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయాలు సాధించడంతో.. అఖిల్ లెనిన్ తో కూడా విజయం సాధిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు. కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ అందుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం లెనిన్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. కెరీర్ లో ఇప్పటికే పలు సినిమాలు చేసిన అఖిల్.. సరైన హిట్ ను మాత్రం సొంతం చేసుకోలేకపోయారు. చివరగా ఏజెంట్ మూవీతో దారుణంగా నిరాశపరిచారు. భారీ బడ్జెట్ తో రూపొందిన ఆ సినిమా.. అనేక విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు లెనిన్ పైనే ఆశలు పెట్టుకున్నారు. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహించిన ఆ సినిమా మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. మరి అఖిల్ ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.